https://epaper.dksaardyamlochaatimpu.com




E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

# డీకే సార్థ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 17 | సంచిక : 293 | ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ | శనివారం, ఆగస్టు,22, 2026 | పేజీలు : 8 | వెల : రూ.1/-

## నా టార్గెట్ రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ కాదు

## కొండా సుస్మిత సంచలన వ్యాఖ్యలు!

**- సోనియా, రాహుల్, ప్రియాంకపై గౌరవం ఉందన్న సుస్మిత- రేవంత్, ఆయన కుటుంబం అవినీతికి పాల్పడుతోందని ఆరోపణ- 'టికెట్ నిర్ణయించడానికి సీఎం ఎవరు?' అని ప్రశ్న- స్వతంత్రంగా పోటీ చేసేందుకు సిద్ధమని ప్రకటన-పరకాల నుంచి పోటీ చేయడం ఖాయమని వెల్లడి**




**హైదరాబాద్,ఆగస్టు 21:**మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కుమార్తె వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ సురేఖ పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. ఈ తరుణంలో కొండా సుస్మిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను కేవలం సీఎం రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని ఆ వ్యాఖ్యలు చేశానని స్పష్టం చేశారు."సీఎం రేవంత్ రెడ్డి పరకాల వచ్చి రేవూరి ప్రకాశ్ రెడ్డికి ఎమ్మెల్యే సీటు ఇస్తున్నట్లు ప్రకటించారు. నేను రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని వ్యాఖ్యలు చేశాను. పార్టీని కాదు. నాకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మీనాక్షి నటరాజన్‌పై చాలా గౌరవం ఉంది. కానీ, రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబం అవినీతికి పాల్పడుతోంది. అందుకే వారిని టార్గెట్ చేసుకున్నాను. పైగా ఎమ్మెల్యే టికెట్ ఎవరికివ్వాలో నిర్ణయించడానికి ఆయన ఎవరు? సీడబ్ల్యూసీ సమావేశాల వంటి వ్యవస్థ ఉందికదా. ఆ ప్రకారంగానే అభ్యర్థులను ప్రకటిస్తారు. నేను అదే ప్రశ్నించాను. నేను స్వతంత్రగా పోటీ చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నాను" అనికొండా సుస్మిత ఓజాతీయ మీడియా ఛానెల్‌తో మాట్లాడుతూ అన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఖాయమంటూ గీసుకొండలో బుధవారం నాడు సుస్మిత అన్న విషయం తెలిసిందే. ఇటీవల పరకాల బహిరంగ సభలో 'వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించాలి' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ అలా ఏకపక్షంగా ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. సీఎం సోదరుడు పెట్టిన డొల్ల కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమిని కట్టబెట్టారని ఆరోపించారు. తాను ఎవరికీ భయపడనని.. తన వ్యాఖ్యలపై కౌంటర్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తే సీఎం కుటుంబం అవినీతిని ఒక్కొక్కటిగా బయటపెడతానన్నారు.

## కేబినెట్, పార్టీ నుంచి సురేఖను తొలగించాల్సిందే

## సీఎల్పీ వేదికగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఫైర్



**హైదరాబాద్,ఆగస్టు 21:**

మంత్రి కొండా సురేఖను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని,పార్టీ నుంచి డిస్మిస్‌చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుముక్తకంఠంతో సీఎల్పీ ప్రెస్‌మీట్‌లో డిమాండ్ చేశారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ ఆమె కుమార్తె కొండా సుస్మిత వివాదం తీవ్రరూపం దాల్చింది. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీని లక్ష్యంగా చేసుకుని సుస్మిత చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ శాసనసభాపక్ష వేదికగా 20 మందికి పైగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అత్యవసర ప్రెస్ మీట్ నిర్వహించారు. కొండా సురేఖను వెంటనే మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయడంతో పాటు, పార్టీ నుండి కూడా డిస్మిస్ చేయాలని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల తరఫున ప్రభుత్వ చీఫ్ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. "కుమార్తె సుస్మిత చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను మంత్రి సురేఖ ఇప్పటివరకు ఖండించకపోవ డాన్ని మేమంతా తీవ్రంగా తప్పుబడుతున్నాం.

ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ కూతురి వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదనడం అత్యంత విడ్డూరం. పార్టీలో ఏవైనా అభిప్రాయభేదాలు ఉంటే సీఎల్పీ లేదా పీసీసీ సమావేశాల్లో మాట్లాడాలి తప్ప, ముఖ్యమంత్రిని, పార్టీని ఉద్దేశించి బహిరంగంగా ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం ఏమాత్రం సరికాదు" అని స్పష్టం చేశారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. కొండా సురేఖ వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "సీఎం రేవంత్ రెడ్డిపై ఎవరు తప్పుడు ఆరోపణలు చేసినా అధిష్టానం కఠిన చర్యలు తీసుకోవాలి. పార్టీలోనే ఉంటూ సీఎం నిర్ణయాలను తప్పుబట్టడం అంటే, ఉన్న చెట్టు కొమ్మను తామే నరుక్కున్నట్లే.

ఈ తల్లీకూతుళ్ల వ్యాఖ్యలను ఖండించకపోతే ప్రతిపక్షాలకు బలం చేకూర్చినట్లవుతుంది. గతంలో కూడా కొండా సురేఖ నోరుజారి పార్టీకి తలవంపులు తెచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు రాత్రింబవళ్లు కష్టపడ్డారు. సీఎంకు కొండా కుటుంబం వెంటనే క్షమాపణ చెప్పాలి. సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసి, పార్టీ నుంచి డిస్మిస్ చేయాల్సిందే" అని డిమాండ్ చేశారు.

## శోకసంద్రంలో తెలుగు చలనచిత్ర పరిశ్రమ..

## అలనాటి నటి షావుకారు జానకి కన్నుమూత

**చెన్నై,ఆగస్టు 21:**తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అలనాటి ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి (95) కన్నుమూశారు. గత కొంతకాలంగా శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు చెన్నై లోని కావేరి ఆస్పత్రిలో చేర్పించారు. మధ్యాహ్నం ఆమె ఆరోగ్యం మరింత విషమించడంతో ఐసీయూలో చికిత్స అందజేస్తుండగా షావుకారు జానకి తదిశ్వాస విడిచారు. అయితే,ఆమె మరణ వార్తను తెలుసుకున్న పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియాలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ నివాళులర్పిస్తున్నారు.జానకి నేపథ్యం ఇలా.. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో 1931 డిసెంబరు 12న శంకరమంచి జానకి జన్మించారు. ఆమె తండ్రి టి.వెంకోజీరావు పేపర్ పరిశ్రమ నిపుణుడు కాగా, తల్లి శచీదేవి గృహిణి. చిన్ననాటి నుంచే కళలపై ఆసక్తి పెంచుకున్న జానకి, తన 11వ ఏటనే రేడియో నాటికల ద్వారా నటన రంగంలోకి అడుగుపెట్టారు. ఆమెకు 15 ఏళ్లకు వివాహమైనప్పటికీ, నటన పట్ల ఉన్న అభిరుచితో రంగస్థల నాటకాల్లో పలు పాత్రలు పోషిస్తూ తన ప్రయాణాన్ని కొనసాగించారు. విజయా ప్రొడక్షన్స్ నిర్మించిన 'షావుకారు' (1950) చిత్రం ద్వారా జానకి చలనచిత్ర రంగానికి పరిచయమయ్యారు. ఆ సినిమాఅనూహ్య విజయంసాధించడమే కాకుండా,ఆమె నటించిన పాత్రకు విశేషప్రజాదరణ లభించడంతో 'షావుకారు జానకి'గా చిత్రసీమలో స్థిరపడిపోయారు. ఆ తర్వాత తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీభాషల్లో కలిపి మొత్తం 380కిపైగా చిత్రాలలో వైవిధ్యమైన పాత్రలు పోషించిమెప్పించారు. ఎన్టీ రామారావు,అక్కినేని నాగేశ్వరరావు, ఎంజీఆర్, శివాజీ గణేశన్ వంటిఅగ్ర కథానాయకుల సరసన సుమారు రెండు





వందలకు పైగా సినిమాల్లో ఆమె కథానాయికగా అలరించారు. 'రోజులు మారాయి', 'మంచి మనసులు', 'డాక్టర్ చక్రవర్తి' వంటి అగ్ర చిత్రాలు ఆమె నటనా పటిమకు నిదర్శనంగా నిలిచాయి. ఇకఆమెసోదరి కృష్ణకుమారికూడా సినీరంగంలో ప్రముఖ నటిగా గుర్తింపు పొందారు. కళారంగానికి ఆమె అందించిన విశేష సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 2022లో ఆమెను ప్రతిష్టాత్మక 'పద్మశ్రీ' పురస్కారంతో సత్కరించింది. వీటితో పాటు అరిజోనా విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న ఆమె, జాతీయ ఫిల్మ్ అవార్డులు, తెలుగు సినిమా అవార్డుల కమిటీల్లో జ్యూరీ సభ్యురాలిగా కూడా సేవలు అందించారు

## బొద్దింకల్ని తరిమికొట్టిన ప్రజలు..

## పాకిస్తానీలు, నక్సల్స్ అంటూ నినాదాలు..

**న్యూఢిల్లీ,ఆగస్టు 21:**రాజస్థాన్ జైపూర్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాల తనిఖీకి వెళ్లిన కాక్రోచ్ జనతా పార్టీ వ్యక్తుల్ని గ్రామస్తులు తరిమికొట్టారు. ఈఘటనపై సీజేపీ నేతలు మాట్లాడుతూ.. బీజేపీగుండాలే దాడి చేశారని ఆరోపించారు. అయితే బీజేపీ మాత్రం గ్రామస్తులే సీజేపీ టీమ్‌ను వ్యతిరేకించారని అంటోంది. మరోవైపు, గ్రామస్తులు తమకు బీజేపీ, కాంగ్రెస్ ఏ పార్టీతో సంబంధం లేదని చెప్పారు.జైపూర్‌లోని బాగ్రూ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని రాంపురా-కన్వార్‌పురా గ్రామంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. సహవ్యవస్థాపకుడు ఆశుతోష్ రాంకా నేతృత్వంలోని బృందం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పరిశీలించేందుకు గ్రామానికి వెళ్లింది. వైరల్ అవుతున్న వీడియోల్లో సీజేపీ కార్యకర్తల్ని గ్రామంలోని ప్రజలు దూషిస్తూ, వారిపై దాడిచేస్తున్న దృశ్యాలు కనిపించాయి. కొందరు వ్యక్తులు వారిని " అర్బన్ నక్సల్స్", "దేశ వ్యతిరేకులు", "పాకిస్తానీలు" అంటూ నినాదాలు చేశారు. దాడి తర్వాత సీజేపీ బృందం పాఠశాలను సందర్శించకుండా వెళ్లిపోయింది. ఈ దాడిపై అశుతోష్ రాంకా మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల కొన్నేళ్లుగా పశువుల కొట్టంలోనే నడుస్తోందని ఆరోపించారు.

గత ఏడాది కూడా తాము ఆస్కూల్‌ను పరిశీలించామని,ఈసారి వెళ్లే విషయాన్ని ముందుగా పోలీసులకు చెప్పామని అన్నారు. అయితే, తమ కార్యకర్తలపై దాడి జరిగిందని,కార్లను ధ్వంసం చేశారని, ఫోన్లు పగలగొట్టారని ఆరోపించారు. ఒక మహిళపై దాడి జరిగిందని, తమ






టీమ్‌లో ఓ వ్యక్తి చేతికి ఫ్రాక్చర్ అయిందని తెలిపారు.

నాయకులు ఉన్నారని అశుతోష్ రాంకా ఆరోపించారు. గ్రామస్తులు దాడి చేయలేదని, బయట నుంచి కొంతమందిని తీసుకువచ్చి హింసను ప్రేరేపించారని, స్థానిక బీజేపీ కౌన్సిలర్ కొందరు వ్యక్తులకు డబ్బులు పంచుతున్నట్లు తమకు సమాచారం ఉందని ఆయన సోషల్ మీడియాలో ఆరోపించారు. అయితే, బీజేపీ ఈ ఆరోపణల్ని ఖండించింది.

గ్రామస్తులే సీజేపీ రాకను వ్యతిరేకించారని ఎమ్మెల్యే స్వామి బాలముకుందాచార్య అన్నారు. పిల్లల విద్యకు అంతరాయం కలిగించే వాతావరణాన్ని సృష్టించేందుకు సీజేపీ ప్రయత్నిస్తోందని చెప్పారు

## ఢిల్లీ పోలీస్ స్టేషన్ వద్ద రాహుల్ గాంధీ ధర్నా

## పెల్లెట్ గన్ బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్

**న్యూఢిల్లీ,ఆగస్టు 21:** కేంద్ర ఢిల్లీలో శుక్రవారం రాజకీయ ఉద్రిక్తత చోటుచేసుకుంది. 'చలో సంసద్' మార్చ్ సందర్భంగా పెల్లెట్ గన్ గాయాలయ్యాయని ఆరోపిస్తున్న 19 ఏళ్ల సాహిల్ లోచబ్‌తో కలిసి కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. సాహిల్ లోచబ్‌కు జూలై 20న జరిగిన 'చలో సంసద్' మార్చ్‌లో పెల్లెట్‌గన్ గాయాలయ్యాయని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. తన ఫిర్యాదుపై ఢిల్లీ పోలీసులు ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని సాహిల్ ఆరోపించాడు.మొదట రాహుల్ గాంధీ, సాహిల్ కలిసి కనాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లోని డీసీపీ కార్యాలయానికి వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు. ఇప్పటివరకు పోలీసులు తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని కూడా రాహుల్ గాంధీ కోరినట్లు కాంగ్రెస్ తెలిపింది. అయితే ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని కాంగ్రెస్ ఆరోపించడంతో రాహుల్ గాంధీ పోలీస్



స్టేషన్ వెలుపల ధర్నాకు కూర్చున్నారు. "ఎఫ్ఐఆర్ లేదు.. న్యాయం లేదు.. అందుకే ఇక్కడే కూర్చున్నాం" అంటూ కాంగ్రెస్ సోషల్ మీడియా వేదికగా పేర్కొంది. డీసీపీ ఇప్పటికీ దర్యాప్తు అధికారిని నియమించలేదని, ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని కాంగ్రెస్ ఆరోపించింది.



## అంకాపూర్ గ్రామాన్ని సందర్శించిన

# రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి




నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 21 (డికె చాటింపు): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శుక్రవారంసందర్శించారు. అంకాపూర్ లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూములు , యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ పరిశీలించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే సొంత గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ల ను ఆదేశించారు. పనులను వేగవంతం చేస్తూ, నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ లో నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూమ్ ల మిగులు లబ్ధిదారులకు డబుల్ బెడ్రూంలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తెచ్చారు. ఆలూరు ఎమ్మార్వో కార్యాలయం, నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నిధులు మంజూరు కు అనుకూలంగా స్పందిస్తూ హామీ ఇచ్చారు.

# మానవతా దృక్పథంతో ఆస్పత్రులు పని చేయాలి


## - ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి -ఎల్బీనగర్‌లో అత్యాధునిక వసతులతో 'ఎస్ 1' ఆస్పత్రి ఘన ప్రారంభం




ఎల్బీనగర్,ఆగష్టు 21 (డీకే చాటింపు) మానవతా దృక్పథంతో ఆస్పత్రులు పని చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని చింతలకుంట, జహంగీర్ నగర్ భారత్ గ్యాస్ గోడౌన్ లేన్‌లో అత్యాధునిక వసతులతో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎస్ 1 హాస్పిటల్' (బోన్, స్కిన్, జనరల్) ను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ధ్యేయంగా ఆస్పత్రులు పనిచేయాలని ఆకాంక్షించారు. ఎల్బీనగర్ ప్రాంత ప్రజలకు ఎముకలు, చర్మవ్యాధులు మరియు సాధారణ వైద్య విభాగాల్లో అనుభవజ్ఞులైన వైద్యులతో కూడిన కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయాలు 'ఎస్ 1 హాస్పిటల్' ద్వారా అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమన్నారు. ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక ప్రజల కోసం నెల రోజుల పాటు ఉచితంగా ఓపీ సేవలు కల్పించడం యాజమాన్యం యొక్క సేవా దృక్పథానికి నిదర్శనమని కొనియాడారు. అనంతరం ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ 50 పడకల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన తమ ఆస్పత్రిలో బోన్, స్కిన్, జనరల్ మెడిసిన్ విభాగాలతో పాటు అన్ని రకాల అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రారంభోత్సవ శుభ సందర్భంగా రోగులందరికీ ఒక నెల రోజుల పాటు ఉచిత ఓపీ సేవలతో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు, సేవలపై భారీ తగ్గింపును అందిస్తున్నట్లు వెల్లడించారు. రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు అధునాతన పరికరాలు, నిపుణులైన వైద్య బృందం ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సాయి శంకర్, డాక్టర్ విశ్వేశ్వర్, మాజీ కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర రెడ్డి, జిట్టా రాజశేఖర్ రెడ్డి, స్థానిక నాయకులు ఎండీ ఖైజర్ భాయ్, గానవానేని వాసు, ఎండీ అనస్ భాయ్, చందన బ్రదర్స్ ఎండీ డాక్టర్ జానా రామారావు, పలువురు వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

ఆర్మూర్ విలేఖరి ఆగస్టు 21 (డీకే చాటింపు):శ్రావణమాసం రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు ఆర్మూర్ ప్రాంతంలో మరియు చుట్టుపక్కల గ్రామంలో మహిళలు ఘనంగా నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం అమ్మవారిని వివిధ వస్త్రాలు పూలు, నగలతో అలంకరించారు భక్తిశ్రద్ధలతో కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించి చుట్టుపక్కల మహిళ సౌభాగ్యవతులను పిలిచి వాయినాలు ఇవ్వడం జరిగింది. తెలుగు రాష్ట్రాల్లో వరలక్ష్మీ వ్రతాని భక్తిశ్రద్ధలతో ఆచరిస్తున్నారు. ఈ వ్రతంలో కుటుంబం ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో ఉండాలని కోరుకుంటూ అదేవిధంగా వర్షాలు బాగా కురవాలని పాడిపంటలు పండాలని మొక్కుకున్నామని మహిళలు భార్గవి ,సాధన ,పద్మ, జయలక్ష్మి జ్యోతి రాణి తదితరులు తెలిపారు.



# కిల్లా రామాలయంలో 101 అడుగుల కాషాయ ధర్మ ధ్వజం భూమి పూజ




నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 21 (డీకే చాటింపు): నిజామాబాద్ నగరంలోని రఘునాథ ఆలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు 101 అడుగుల కాషాయ ధర్మ ధ్వజం ఏర్పాటుకు సంబంధించి భూమి పూజ స్థానిక ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ చేశారు. ఇందూరు కు తలమానికమైన శ్రీ కిల్లా రఘునాథ ఆలయము అతి పురాతనమైనది . ఇట్టి ఆలయము గతంలో జిల్లా జైలు గా ఉండడం వల్ల అభివృద్ధికి నోచుకోలేదు జిల్లా రామాలయం ట్రస్ట్ ఏర్పడిన తర్వాత మెల్లమెల్లగా అభివృద్ధి కి ట్రస్ట్ సభ్యులు కృషి చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా నిధులు మంజూరు చేసినట్లయితే ఈ ఆలయము ఆలయము చుట్టూ ఉన్న యాభై మూడు ఎకరాల పరిసరాలు పర్యాటక కేంద్రంగా మారుతుంది. ఇందూరు నగర ప్రజల ఆశయాన్ని నెరవేర్చాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి స్థానిక బిజెపి ఎమ్మెల్యే కోరారు. భూమి పూజ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు అధ్యక్షులు ముక్క దేవేందర్ గుప్తా, గురు ప్రసాద్, ఆలయ పూజారి సందీప్ తివారి , నాని పంతులు, బిజెపి కార్పొరేటర్లు వివిధ సంఘాల నాయకులు కార్యకర్తలు హిందూ సంస్థలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు

# అధ్యాపకుల చేతిలోనే ఉంటుంది

## రెండు రోజులపాటు జరగనున్న ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో

### కళాశాల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి






మహేశ్వరం, ఆగష్టు 21 (డీకే చాటింపు) మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట్ లోని తీగల కృష్ణారెడ్డి కళాశాలలో టీకేఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ సైన్స్ ( టీకేఆర్ఐఎంఎస్ ) లో ఏఐ ఐన్ ఎవిరిడే లైఫ్ మేకింగ్ డైలీ టాస్క్ ఈసీర్ అనే అంశంపై ఏ ఐ సి టి ప్రయోజిత అటల్ అధ్యా పక అభివృద్ధి కార్యక్రమం (ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఎ ఫ్ డీపీ) రెండు రోజులపాటు జరగనున్న కార్యక్రమాన్ని ప్రారంభించిన కళాశాల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అధ్యాపకులను తీర్చిదిద్దటంలో మరియు ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పెరుగుతున్న ప్రాధాన్యతను విద్యారంగంలో నాణ్యతను పెంపొందించడానికిా× తో పాటు మానవ మేధస్సు కమ్యూనికేషన్ నైపుణ్యాలు నైతిక విలువలు మరియు సృజనాత్మకతను సమన్వయం చేయాల్సిన అవసరాన్ని పలువురు వక్తలు అధ్యాపకులకు వివరించనున్నారు. కళాశాల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థుల భవిష్యత్తు ముఖ్యంగా అధ్యాపకుల చేతిలో ఉంటుంది విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించడం మరియు వారు ఏ రంగంపై వారు శ్రద్ధ చూపుతున్నారు దానికి అనుగుణంగా వారిని తీర్చిదిద్దటం తల్లిదండ్రులను ప్రేమించటం ఉపాధ్యాయులను గౌరవించడం సమాజంలో ప్రస్తుతం జరుగుతున్న కొన్ని చెడు వ్యసనాలకు వారిని దూరంగా ఉంచటం లాంటివి విద్యార్థులకు నేర్పించడంలో అధ్యాపకుల పాత్ర ఎంతగానో ఉంటుంది అని తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ డీన్ ప్రొఫెసర్ వై జహంగీర్ గారు మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అధ్యాపకులను తీర్చిదిద్దటం తీర్చిదిద్దటం మరియు ఉన్నత విద్యారంగంలో నవీన ఆలోచనలకు ప్రోత్సాహం అందించడం వంటి విషయాలను అధ్యాపకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం రిజిస్టర్ కొప్పుల అంజి రెడ్డి గారు తీగల కృష్ణారెడ్డి కళాశాల మేనేజ్మెంట్ సైన్స్ ప్రిన్సిపల్ డాక్టర్ రేణుక సాగర్ గారు వివిధ కళాశాలకు చెందిన అధ్యాపకులు పరిశోధకులు విద్యార్థిని విద్యార్థులు విద్యావేత్తలు పాల్గొన్నారు.



## ఆర్మూర్ నియోజకవర్గ

# అభివృద్ధికి సహకరించండి

## రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి విన్నపం



ఆర్మూర్ విలేఖరి ఆగస్టు 21 (డీకే చాటింపు): శుక్రవారం రోజు నిజాంబాద్ జిల్లా ఆర్మూర్లో పర్యటనకు విచ్చేసినటువంటి రెవిన్యూ శాఖ మంత్రి మరియు హౌసింగ్ శాఖ మంత్రి అయిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు మరియు రాకేష్ రెడ్డి గారు కలిసి నియోజకవర్గంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంకాపూర్ లో అసంపూర్తిగా ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే పూర్తి చేయించి లబ్ధిదారులకు అందించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి విన్నవించారు. అదేవిధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ సముదాయాన్ని కూడా త్వరగా పూర్తి చేయించుటకు చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. మంత్రి వెంటనే స్పందించి అధికారులకు ఆదేశిస్తూ కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా పనులు త్వరిత గతిన పూర్తి చేయుటకు సన్నాహాలు చేయాలని కోరారు. ఆలూరు మండలంలో ఎమ్మార్వో భవనం నిర్మాణంకు నిధులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి కోరారు. మంత్రి వెంట ఆర్డిఓ ,హౌసింగ్ అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి ఆశయ సాధనకు..!

## -నారాయణపేట నియోజకవర్గంలో ఘనంగా వేడుకలు... -నారాయణపేటలో చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన చిట్టెం అభిజయ్ రెడ్డి... -నారాయణపేటలో రక్తదాన శిబిరం... -ధన్వాడలో చిట్టెం ఘాటుకు పూజలు,నివాళులు...



నారాయణపేట,(డీకే చాటింపు): చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో పలు కార్యక్రమాలు జరిగాయి. స్థానిక మార్కెట్ యార్డు దగ్గర ఉన్న చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి విగ్రహానికి వారి తనయుడు, పిసిసి సభ్యులు చిట్టెం అభిజయ్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. డిసిసి మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే ధన్వాడలో చిట్టెం ఘాటుకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. సివిఆర్ భవన్లో జరిగిన కార్యక్రమంలో ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ముందుకు వెళ్దామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు,శ్రేణులు, చిట్టెం అభిమానులు తదితరులు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట 320 ా ఆధ్వర్యంలో స్థానిక సివిఆర్ భవన్లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్ కుంభం శివకుమార్ రెడ్డి, మల్టిపుల్ కౌన్సిల్ మెంబర్ లయన్ డాక్టర్ హరి నారాయణ బట్టాడ్,లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ రవికుమార్ గౌడ్,సెక్రెటరీ లయన్ మోహన్ కుమార్ కోన,కోశాధికారి లయన్ రాజేష్ పోలేపల్లి,సీనియర్ లయన్స్ సభ్యులు లయన్ జనార్దన్,లయన్ సాయినాథ్, వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఇన్‌చార్జ్ ఉ కోచ్ ఎస్.చక్రవర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారియర్స్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థిని,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయడంలో తమ వంతు సహకారాన్ని అందించారు. రక్తదానం- ప్రాణదానం,ఒకరి రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడగలదు. లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట 320ా సేవే మా లక్ష్యం-సమాజ సేవే మా ధ్యేయం అని నారాయణపేట లయన్స్ క్లబ్ అధ్యక్షులు రవికుమార్ గౌడ్ తెలిపారు.



డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
శనివారం, ఆగస్టు,22, 2026

# ఒకప్పుడు అప్రతిహతం.. నేడు హతం!

దేశంలో కమ్యూనిజం సిద్ధాంతాలను బలోపేతం చేసిన కమ్యూనిస్టు పార్టీలు.. తాజా ఎన్నికలతో కనుమరుగయ్యాయి. ప్రజా పాలనలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన సీపీఐ, సీపీఎం పార్టీలు.. పలు రాష్ట్రాల్లో అధికారం చలాయించాయి. అయితే.. ఒక్కొక్క దశలో ఎదురైన అనేక సంఘర్షణల కారణంగా కాలానికి అనుగుణంగా దూసుకుపోయే తత్వాన్ని అలవరుచుకోని కామ్రెడ్లు.. ప్రజా క్షేత్రంలో తమను తామే ఓడించుకుని.. అధికారానికి దూరమయ్యారు. తాజాగా కేరళలో ఎల్‌డీఎఫ్ కూటమి సైతం ఓటమి పాలవడంతో దేశంలో ఎక్కడా కమ్యూనిస్టుల ప్రభుత్వం లేకుండా పోయింది. మొత్తం 36 రాష్ట్రాల్లో ఎక్కడా కమ్యూనిజం ప్రభావం కూడా కనిపించకపోవడం గమనార్హం. 1980వ దశకంలో, సీపీఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష పార్టీలు కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లను ఏకకాలంలో పాలించాయి. లోక్‌సభలోనూ సత్తా చాటాయి. 2004లో 60కి పైగా సీట్లు గెలుచుకుని అత్యున్నత స్థాయికి చేరుకున్నాయి. భారత్–అమెరికా అణు ఒప్పందంపై లోక్‌సభలో దాదాపు 60 మంది ఎంపీలు ఉన్న వామపక్ష కూటమి మద్దతు ఉపసంహరించుకోవడంతో, మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం బలపరీక్షను ఎదుర్కోవలసి వచ్చింది. ఇది అప్పట్లో పెను సంచలనంగా మారింది.పశ్చిమ బెంగాల్‌లో 1977 నుండి 2011 వరకు వామపక్ష కూటమి అధికారంలో ఉంది. ఈశాన్య రాష్ట్రం త్రిపురను 1993 నుండి 2018 వరకు పాలించింది. ఇక, కేరళలో ప్రతి ఐదేళ్లగా అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ తాజా ఎన్నికల్లో అధికారం కోల్పోయింది. 1977లో పశ్చిమ బెంగాల్‌లో సీపీఐ(ఎం) అధికారంలోకి వచ్చింది. తద్వారా ఏ రాష్ట్రంలోనైనా ఏ పార్టీకి దక్కని సుదీర్ఘ నిరంతర పాలనకు నాంది పలికింది. జ్యోతి బసు 23 సంవత్సరాలకు పైగా ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2000లో బుద్ధదేబ్ భట్టాచార్య సీఎం అయ్యారు. ఆ తర్వాత వామపక్షాలు మరో 11 సంవత్సరాల పాటు బెంగాల్‌ను పాలించాయి. ఈశాన్య రాష్ట్రం త్రిపురలో 1993 నుండి 2018 వరకు వామపక్షాలు అధికారం దక్కించుకున్నాయి. 1993లో రాష్ట్రంలో వామపక్షాలు ఘనవిజయం సాధించాయి. అసెంబ్లీలోని 60 స్థానాలకు గాను సీపీఐ(ఎం) ఒక్కటే 44 స్థానాలను గెలుచుకుంది. 1998 వరకు దశరథ్ దేబ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ తర్వాత మాణిక్ సర్కార్ బాధ్యతలు స్వీకరించి 20 సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగారు. త్రిపురలో 25 ఏళ్ల వామపక్ష కూటమి పాలన 2018లో బీజేపీ అనూహ్యంగా ఓడించడంతో ముగిసింది. 2023లో బీజేపీ విజయాన్ని పునరావృతం చేసింది.కేరళలో సీపీఐ(ఎం) పేలవమైన ప్రదర్శనతో వామపక్షాల చివరి కంచుకోట కూలిపోయింది. ప్రస్తుత ఓట్ల లెక్కింపు సరళి ప్రకారం, ఈ దక్షిణ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సునాయాసమైన ఆధిక్యాన్ని సాధించింది. 2016లో అధికారంలోకి వచ్చిన పినరయి విజయన్ నేతృత్వంలోని సీపీఐ(ఎం) లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం అధికారం నుంచి దిగిపోయింది. 1977 తర్వాత తొలిసారిగా భారతదేశంలో కమ్యూనిస్ట్ ముఖ్యమంత్రి లేక పోవడం గమనార్హం. మరో వైపు దేశవ్యాప్తంగా కార్మికులు, కర్షకుల ఉద్యమా లకు పెట్టింది పేరుగా ఈ పార్టి ప్రాభవం దక్కించుకుంది. గత వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాల చరిత్ర మహోన్నతమైనది. రష్యా అక్టోబర్ విప్లవ ప్రభావంతోనే ఇండియాలో కూడా 1925లోనే రాడికల్ హ్యూమనిస్టు యంయన్.రాయ్, దత్,యస్ఏ డాంగే, తదితర కార్మిక నేతల నేతృత్వంలో "కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా" సీపీఐ కి అంకురార్పణ జరిగింది. ఆనాటి బ్రిటిష్ వలసవాదులు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించడంతో అప్పట్లో రహస్యంగా పనిచేయవలసి వచ్చింది. దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులు ఎన్నెన్నో ఉద్యమాలు చేసారు. గ్రామీణ రైతాంగ ఉద్యమాలు మొదలు, పట్టణ పారిశ్రామిక కార్మికుల ఉద్యమాలు, సింగరేణి, ఆర్టీసీ కార్మికులు , ఉపాధ్యాయ, బ్యాంకు, రైల్వే, ఆర్టీసీ , ఎలక్ట్రిసిటీ , టెలిఫోన్, ప్రభుత్వ ఉద్యోగులైతేనేమి, బీడీ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులైతేనేమి, ఇళ్ల స్థలాల ఉద్యమాలైతే నేమి , జీతాలు, కూలీలు, బోనసులు, పని పరిస్థితుల మెరుగుదల మొదలైన వన్నీ కోట్లాది ప్రజలకు అందిన మేరకు అవన్నీ కమ్యూనిస్టు ఉద్యమాల ఫలితాలే. లక్షలాది కమ్యూనిస్టు కార్యకర్తల , నాయకుల త్యాగాల ఫలితమే నేడు అమలులో ఉన్న ప్రావిడెంటు ఫండ్ , పెన్షన్, సెలవులు, 8 గంటల పని, తదితర సౌకర్యాలు. ఆదివాసీ గిరిజనులకు,పేదలకు కొన్నయినా భూములు దక్కాయంటే కమ్యూనిస్టులు, నక్సలైట్లు, మావోయిస్టులు, వేలాది మంది ప్రాణ త్యాగాలతో సాధించి పెట్టినవే. ఇంతటి మహత్తర ఉద్యమాల చరిత్ర వేల వేల పేజీలు వేలాది పుస్తకాలుగా డాక్యుమెంట్లుగా రికార్డయి వున్నాయి.నిజానికి కాంగ్రెస్ పార్టీ గురించి చాలా మంది చర్చిస్తారు. కానీ, కాంగ్రెస్ కంటే కూడా ముందుగానే గ్రామాల్లో పరిఢవిల్లిన పార్టీ సీపీఐ అంటే ఆశ్చర్యం వేస్తుంది. ఏ గ్రామానికి వెళ్లినా.. నాలుగు రోడ్ల కూడలిలో ఎర్ర జెండా ఎగరేసే దిమ్మెలు దర్శనమిస్తాయి.




# నూతన ప్రభుత్వ కార్యాలయ భవనాలతో ప్రజలకు మెరుగైన సేవలు:మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి







జగిత్యాల, ఆగస్టు21,(డీకే చాటింపు): జిల్లాలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణంతో ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ధరూర్ క్యాంప్‌లో నూతనంగా మంజూరైన పలు ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగుల మరియు ట్రాన్స్‌జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, సి.సి.ఎల్.ఏ. కమిషనర్ లోకేష్ కుమార్, స్పెషల్ సెక్రటరీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎం.డి.హౌసింగ్ గౌతం, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. జగిత్యాల రెవెన్యూ డివిజనల్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల అంచనా వ్యయంతో , మెట్‌పల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల నిధులు, భీమారం తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల అంచనా వ్యయంతో,ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల నిధులు, మాల్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.40 కోట్ల అంచనా వ్యయంతో, మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.40 కోట్ల నిధులు మొత్తంగా ఆరు ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికి రూ.11.80 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, భీమారం, ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయాలు, మాల్యాల, మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక సౌకర్యాలతో నూతన కార్యాలయ భవనాలను నిర్మించడం ద్వారా ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, సౌకర్యవంతంగా అందించేందుకు వీలవుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, అధికారులు మరియు సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు అనువైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నూతన భవనాల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ తదితర శాఖల సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు. కార్యాలయాల నిర్మాణంలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు.జిల్లాలో పరిపాలనా సౌకర్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాల్లో శాసన మండలి సభ్యులు ఎల్ .రమణ, చొప్పదండి శాసనసభ్యులు మేడిపెల్లి సత్యం , వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావు, అదనపు కలెక్టర్ లు బి. ఎస్ లత, బి. రాజ గౌడ్, జగిత్యాల జిల్లా గ్రంథాలయం చైర్మన్ సంఘనభట్ల దినేష్, జగిత్యాల, మెట్ పెల్లి, కోరుట్ల ఆర్డీవోలు మధుసూదన్, నరసింహ రావు, జీవాకర్ రెడ్డి, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ నాగజ్యోతి, మెట్ పెల్లి మున్సిపల్ చైర్మన్, కోరుట్ల మున్సిపల్ చైర్మన్, రాయికల్ మున్సిపల్ చైర్మన్, ఆయా మండలాల స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలి



## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల్ (డీకే చాటింపు)ఆగస్టు 21:ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను పూర్తిస్థాయిలో కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని దండేపల్లి మండలం ద్వారక గ్రామంలో కొనసాగుతున్న ఎస్.టి. బాలుర వసతి భవన నిర్మాణ పనులను పరిశీలించి, పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఎస్.టి. వసతి గృహ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, విద్యాబోధన తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకొని, కళాశాలలో విద్యార్థుల సంఖ్యను మరింత పెంపొందించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, అనుమలిస్ వారికి నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేయాలని, నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఓ.పి. రిజిస్టర్, వార్డు, ల్యాబ్, మందుల నిల్వలను పరిశీలించి ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందులు, వైద్య సేవలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేట్ ఆసుపత్రులలో జరుగుతున్న గర్భిణుల ప్రసవాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు విధులలో అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులలో సాధారణంగా నమోదు అయ్యే వ్యాధుల వివరాలను తెలుసుకొని వర్షాకాలం దృష్ట్యా అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి, పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వంటశాల, భోజన శాల, వసతి గదులను పరిశీలించి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.జన్నారం మండలం కిష్టాపూర్ లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధన ఇతర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యే ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థులకు సకాలంలో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఓ.పి. రిజిస్టర్, వార్డు, మందుల లభ్యత, వైద్య సేవలను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో, ప్రైవేట్ ఆసుపత్రులలో జరుగుతున్న ప్రసవాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ల హాజరు, అందుబాటులో ఉన్న వైద్య సేవలపై వివరాలు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండల తహసిల్దార్ తో మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, అనుమలిస్ వారికి నిబంధనల ప్రకారం నోటీసుల జారీ ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, సంక్షేమ వసతి గృహాలు, ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దండేపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా వరలక్ష్మి వ్రతం



నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 21(డీ కే చాటింపు): శ్రావణమాసంలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతము తెలుగు రాష్ట్రాలలో మహిళలు ఘనంగానిర్వహించారు.వివాహిత మహిళలు కుటుంబ శ్రేయస్సు ఐశ్వర్యం దీర్ఘకాల సుమంగళి కోసం లక్ష్మీ స్వరూపమైన వరలక్ష్మి దేవిని శుక్రవారం భక్తి శ్రద్దలతోపూజించారు.వినాయక పూజ, కలశపూజ చేసిన అనంతరం తొమ్మిది పోగులతో కూడిన కంకణం చేతికి భర్తతో కట్టించు కుంటారనీ ఆలయ పూజారులు రాకేశ్ సునీల్ లు తెలిపారు.అమ్మవారికి నైవేద్యంగా పాయసం,అప్పాలుబూరెలు పిండివంటలు పెట్టారు. పూజా అనంతరం 9, లేదా 11మంది మహిళలకు వాయనం ఇవ్వడం వరలక్ష్మి వ్రతం ఆనవాయితీ . దేవి మాత మందిరం,పెద్దమ్మ తల్లి,ఉత్తర తిరుపతి దేవాలయం,మహాలక్ష్మి దేవాలయం, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవాలయాలలో అమ్మవారికి ఒడి బియ్యం చీరే సారెలు మహిళలు పెద్దఎత్తున సమర్పించారు.

# అంజనిపుత్ర 10 వేల ఆర్థిక సహాయం



క్యాతనపల్లి(డీకే చాటింపు): రామకృష్ణాపూర్ లో తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మిగిలిన బాధితురాలికి దాతలు అండగా నిలిచారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు అమరావాది గ్రామానికి చెందిన జీలకర్ర బాణమ్మ ఇటీవల అనారోగ్య కారణంగా మృతిచెందడంతో ఆమె కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.ఇప్పటికే తండ్రి లేకపోవడం, ఇప్పుడు తల్లి కూడా మరణించడంతో ఆమె కుమార్తె ప్రియభారతి ఒంటరిదైంది. బాణమ్మకు నలుగురు సంతానం కాగా, ముగ్గురు కుమార్తెలకు ఇప్పటికే వివాహాలయ్యాయి. ఇంకా వివాహం కాని చిన్న కుమార్తె ప్రియభారతికి కుటుంబ బాధ్యతలు భారంగా మారాయి. తల్లి దశదిన కర్మ జరిపేందుకు కూడా దారి లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం అమరావాది గ్రామస్తుడు జిలకర సురేష్ దృష్టికి వెళ్లింది.సురేష్ ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న అంజనిపుత్ర ఎస్టేట్స్ చైర్మన్ గుర్రాల శ్రీధర్ వెంటనే స్పందించారు. బాధితురాలికి తల్లి దశదిన కర్మ ఖర్చుల నిమిత్తం రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని శుక్రవారం గ్రామస్తుల చేతుల మీదుగా అందజేశారు. ఆపద సమయంలో స్పందించి చేదోడుగా నిలిచిన గుర్రాల శ్రీధర్, సురేష్‌లకు బాధితురాలు, అమరావాది గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జిలకర మహేష్ ,మనోహర్, రాము,కిరణ్,ప్రవీణ్, రవి,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సేవ్ పాలిటెక్నిక్ శక్తి స్కీంని రద్దు చేయండి

నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 21 (డికె చాటింపు):పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుని అంధకారం చేసే విధంగా ఉన్న ఈ శక్తి స్కీంని వెంటనే రద్దు చేయాలని కోరుతూ నిజాంబాద్ నగరంలోని మహిళా పాలిటెక్నిక్ విద్యార్థినులు శుక్రవారం గేట్ ధర్నా నిర్వహించారు. సేవ్ పాలిటెక్నిక్ సేవ్ స్టూడెంట్స్ అని నినాదంతో మార్మోగిస్తున్నారు. ఎంతో ఉత్సాహంతో మేము పాలిటెక్నిక్ విద్య నేర్చుకుంటున్నాము దాని తర్వాత లెటరలే ఎంట్రీ కింద ఇంజనీరింగ్ లో చేరుతామని ఆశతోనే ఈ పాలిటెక్నిక్ చదువులు సాగిస్తున్నామని ఇదిలా ఉండగా దీన్ని కూడా తొలగించి ఐటిఐ పాలిటెక్నిక్ అన్ని కలిపి సపరేట్గా స్కిల్ ఏర్పాటు చేస్తాం అనేది విద్యార్థులకు సమంజస యోగం కాదని ,ఈ సందర్భంగా గట్టిగా నినాదాలు చేస్తూ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించారు. నిజామాబాద్ నందిపేట్ కోటగిరి ,తదితర పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు వారి వారి పాఠశాల గేటు ముందు ధర్నాలు చేస్తున్నారు.



# నారాయణపేట యశోద హాస్పిటల్స్ లో ఉచిత ఆర్థోపెడిక్ మెగా హెల్త్ క్యాంప్ విజయవంతం

**-620 మందికి పైగా పేషంట్లకు చికిత్స... -లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట సహకారంతో... -ఉచిత వైద్య సేవలకు విశేష స్పందన... -నిపుణులైన వైద్యులచే ఉచితంగా వైద్య సేవలు... -అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన కుంభం శివకుమార్ రెడ్డి...**





నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట ఓల్డ్ గంజ్‌లోని యశోద కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట సహకారంతో శుక్రవారం నిర్వహించిన ఉచిత ఆర్థోపెడిక్ మెగా హెల్త్ క్యాంప్ కు విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి దాదాపు 620 మందికి పైగా పేషంటు హాజరై వివిధ వైద్య సేవలను ఉచితంగా పొందారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఎముకలు,కీళ్ల సమస్యలు,మోకాళ్లు,భుజం, వెన్నెముక, ఫ్రాక్చర్లు, గాయాలు,కండరాలు, లిగమెంట్ల సమస్యలతో పాటు సాధారణ ఆరోగ్య సమస్యలకు నిపుణులైన వైద్యులు ఉచితంగా వైద్య సలహాలు అందించారు. ఈ క్యాంప్‌లో మొత్తం 320 మందికి ఉచిత డిజిటల్ ఎక్స్రే,180 మందికి ఉచిత యు.ఎస్.జి,420 మందికి ఉచిత ఈసిజి,అవసరమైన వారికి ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత అంబులెన్స్ సేవలను డిసిసి మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ప్రారంభించారు. అత్యవసర పరిస్థితుల్లో,పేద ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేయడంలో ఈ అంబులెన్స్ సేవలు ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన 300 ఎంఏ డిజిటల్ ఎక్స్రే సేవలను శివకుమార్ రెడ్డి ప్రారంభించారు. లయన్స్ క్లబ్ గవర్నర్ హరినారాయణ బట్టాడ్ క్యాంప్ నిర్వహణను అభినందించారు. ఈ క్యాంప్‌లో డాక్టర్ జె.నవీన్ కుమార్ రెడ్డి,డాక్టర్ రవీందర్ లకావత్,డాక్టర్ రాజ్ కుమార్ మంచాల,డాక్టర్ అమిత, డాక్టర్ ప్రశాంత్ రెడ్డి,ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా యశోద కేర్ హాస్పిటల్స్ యాజమాన్యం మాట్లాడుతూ గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం తమ ప్రధాన లక్ష్యమని,భవిష్యత్తులో కూడా ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. "మీ ఆరోగ్యం... మా లక్ష్యం"అనే నినాదంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు యశోద కేర్ హాస్పిటల్స్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి జన్మదినం సందర్భంగా లయన్ కుంభం శివకుమార్ రెడ్డి ఉచిత భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేటఉచిత భోజన సేవా(ఆకలి నివారణ-ఒక ప్రపంచ సేవా కార్యక్రమం)2026-27 సంవత్సరంలో శుక్రవారం (52వ రోజు)700 మందికి ఉచిత భోజనం అందించారు. యశోద కేర్ హాస్పిటల్,ఓల్డ్ గంజ్,నా రాయణపేటలో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్ కుంభం శివకుమార్ రెడ్డి ఉచిత భోజన కార్యక్రమానికి స్పాన్సర్‌గా వ్యవహరించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ రవి కుమార్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ లయన్ కృష్ణమూర్తి,లయన్ బి.సాయినాథ్,లయన్ సదానందం,లయన్ ఎస్. చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



# వివిధ సమస్యల సాధనకై.. ఈనెల 27న నారాయణపేటలో జేఏసీ ధర్నా

**-ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం... -టీజీ ఈజేఏసీ చైర్మన్ ఎం. నరసింహారెడ్డి...**



నారాయణపేట,(డీకే చాటింపు): వివిధ సమస్యల సాధనలో భాగంగా ఈనెల 27న నారాయణపేట జిల్లా కేంద్రంలో జేఏసీ చేపట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీజీ ఈజేఏసీ చైర్మన్ ఎం. నరసింహారెడ్డి,టీజీ ఈ జేఏసీ భాగస్వామ్య సంఘాలు పిలుపునిచ్చాయి. నారాయణపేట జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రంలో టీజీ ఈ జేఏసీ భాగస్వామ్య సంఘాల అత్యవసర సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న భాగస్వామ్య సంఘాల బాధ్యులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జేఏసీకి ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోవడంతో రాష్ట్ర శాఖ సూచనల మేరకు ఈ ధర్నా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వారు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే పిఆర్సి, పెండింగ్ డిఎలు సిపిఎస్ రద్దు,ముఖ్యంగా మూడు నెలలుగా అభాస పాలవుతున్న హెల్త్ కార్డుల అమలులో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ ధర్నా కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. అలాగే విద్యాశాఖలోని +రా 25ను సవరణ చేసి ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా, 317 జీవోకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. 2004 సెప్టెంబర్ 1ముందు నోటిఫికేషన్ ఇచ్చిన వారి కి పాత పెన్షన్ తదితర డిమాండ్లతో ఈనెల 27న జిల్లా కేంద్రంలోని వివేకానంద పార్కు వద్ద జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఉద్యోగ,ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని చైర్మన్ ఎం. నరసింహారెడ్డి,జేఏసీలోని అన్ని భాగస్వామ్య సంఘాల బాధ్యులు పిలుపునిచ్చారు. జిల్లాలో జరిగే ఈ ధర్నాను విజయవంతం చేయడానికి కలిసికట్టుగా పనిచేయాలని ప్రతి ఉద్యోగిని, ఉపాధ్యాయుడు ఈ ధర్నాలో పాల్గొనే విధంగా కృషి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బేశజాలకు పోకుండా ఇప్పటికే ప్రతి ఉద్యోగి ప్రతినెల కనీసం పదివేల రూపాయల నుంచి 25 వేల రూపాయల వరకు ఆర్థికంగా నష్టపోతూ వ్యయ ప్రయాసలకు లోన్ అవుతూ పనిచేస్తున్నారని ఉద్యోగ ఉపాధ్యాయుల సహనాన్ని పరీక్షించవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇక ప్రభుత్వం తో తాడోపేడో తేల్చుకునే సమయము ఆసన్నమైందని అందు వల్లనేవేసిన ఉద్యమాన్ని తిరిగి ప్రారంభిస్తున్నట్లు జేఏసి నేతలు పేర్కొన్నారు. జేఏసీ అడిషనల్ సెక్రటరీ జనరల్ వై.జనార్దన్ రెడ్డి,కో చైర్మన్లు రెడ్డప్ప,భీమయ్య,సూర్య చంద్ర,సంతోష్ కుమార్,రామ్ రెడ్డి,యశ్వంత్ భాగస్వామ్య సంఘాల సభ్యులు హైమావతి,వేణుగోపాల్, రఘువీర్ వాళ్య నాయక్, వెంకటప్ప పాల్గొన్నారు.

# జీఎస్ఐ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా ఎర్ర వినోద్ రెడ్డి

ఎల్బీనగర్, ఆగస్టు 31( డీకేచాటింపు) ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో నూతనంగా ఏర్పడిన జీఎస్ఐ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా ఎర్ర వినోద్ రెడ్డి నియమితులయ్యారు. డివిజన్ల పునర్విభజనలో భాగంగా జీఎస్ఐ డివిజన్ నూతనంగా ఏర్పడగా, పార్టీ అధిష్టానం ఆయనను అధ్యక్షుడిగా నియమించింది. ఎర్ర వినోద్ రెడ్డి రాక్‌టౌన్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, స్థానికంగా తనదైన గుర్తింపు పొందారు. సామాజిక సేవలతో పాటు బీజేపీలో క్రియాశీలకంగా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం జీఎస్ఐ డివిజన్ అధ్యక్ష బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా ఎర్ర వినోద్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి వాటిపై అవగాహన కల్పిస్తానన్నారు. డివిజన్‌లో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. తనకు ఈ అవకాశం



కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు,, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, సామ రంగా రెడ్డి, చింతల సురేందర్ యాదవ్ మరియు ఇతర ఎల్బీనగర్ నియోజకవర్గం బిజెపి నాయకులకు ఎర్ర వినోద్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# 12 ఏళ్లలో రైటాఫ్ రుణాల విలువ రూ. 10 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ** : బ్యాంకులు, ఆర్థిక సంస్థలు పెద్ద పెద్ద వ్యాపారులకు, కార్పొరేట్లకు, ఇతర సర్వీస్ సెక్టార్లో బారోవర్లకు పెద్ద మొత్తంలో లోన్లు ఇస్తుంటాయి. ఇక్కడ చాలా మంది తిరిగి చెల్లించక మొండి బకాయిలు పెద్ద మొత్తంలో పేరుకుపోతుంటాయి. వీటిని బ్యాంకింగ్ పరిభాషలో నాన్ పెర్ఫామింగ్ అసెట్స్ అంటారు. ఇక బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తాము ఇచ్చిన లోన్లను తిరిగి రాబట్టుకోవడం కష్టమనిపిస్తేవాటిని బ్యాంకులు తాత్కాలికంగా రద్దు చేస్తుంటాయి. దీనినే లోన్ రైటాఫ్ (లోన్లు సాంకేతికంగా రద్దు) అని పిలుస్తారు. ఇక్కడ గుర్తుంచుకోవాల్సింది ఏంటంటే రైటాఫ్ చేసినంత మాత్రాన లోన్లు రద్దయినట్లు కాదు. ఇది రుణ మాఫీ ఏ మాత్రం కాదు. లోన్ రికవరీ కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంటాయి. అయితే బ్యాలెన్స్ షీట్ నుంచి మాత్రమే ఈ లోన్లను తొలగిస్తారు. ఇక్కడ నిరర్థక ఆస్తుల్ని తగ్గించుకునేందుకు, లాభదాయకత చూయించుకునేందుకు బ్యాంకులు చేసే సాంకేతిక ప్రక్రియనే లోన్ రైటాఫ్ అంటారు. ఇక ఇలా గత 12 ఏళ్లలో చూస్తే ఇలా పెద్ద కార్పొరేట్ రుణ గ్రహీతలకు ఇచ్చిన దాదాపు రూ. 9.95 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ చేశాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు వెల్లడించింది. ఇక్కడ రుణాల్ని రైటాఫ్ చేయడం అంటే రుణ గ్రహీతలకు అప్పును మాఫీ చేసినట్లు కాదని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ వివరాల్ని వెల్లడించారు. ఇక బ్యాంకుల రుణ రైటాఫ్‌లో గత కొన్నేళ్లుగా గణనీయమైన మార్పు కనిపిస్తోందని గణాంకాలు చెబుతున్నాయి. బ్యాంకులు రైటాఫ్ చేసిన రుణాల్లో అత్యధిక మొత్తం



2018-19 ఆర్థిక సంవత్సరంలో నమోదైంది. ఆ ఏడాదిలో ఏకంగా రూ. 1,48,753 కోట్ల రుణాల్ని బ్యాంకులు సాంకేతికంగా రద్దు చేశాయి. తర్వాతి సంవత్సరాల్లో చూస్తే రైటాఫ్ చేసిన రుణాల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. కిందటి 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 20,485 కోట్ల రుణాల్ని రైటాఫ్ చేసినట్లు కేంద్రం వెల్లడించింది. 2018-19తో పోలిస్తే 2025-26 లో రైటాఫ్ చేసిన రుణాల మొత్తం భారీగా తగ్గింది. ఇక గత 12 ఏళ్ల లెక్కల్ని చూస్తే మాత్రం దాదాపుగా రైటాఫ్ రుణాల విలువ రూ. 10 లక్షల కోట్లకు చేరడం గమనార్హం. చాలా మంది మాత్రం రుణాల రైటాఫ్ అంటే రుణ మాఫీగా భావిస్తుంటారు. కానీ ఈ రెండూ ఒకటి కాదు. బ్యాంకులు తమ బ్యాలెన్స్ షీట్లను సరిచేసుకునేందుకు, మొండి బకాయిల్ని పుస్తకాల నుంచి తొలగించేందుకు రైటాఫ్ ప్రక్రియను ఉపయోగిస్తుంటాయి.

# 2028 గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్



**హైదరాబాద్** : 2028 అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో మళ్లీ అధికారంలోకి రావడమే ఏకైక లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సరికొత్త సంస్థాగత వ్యూహానికి తెరలేపింది. సాధారణంగా కేడర్‌కు ఇచ్చే పార్టీ పదవులను ఈసారి నేరుగా గెలిచిన ప్రజాప్రతినిధులకే కట్టబెడుతోంది. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని మెజార్టీతో మళ్లీ అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే వ్యక్తం చేస్తున్న ధీమా వెనుక ఈ పక్కా సంస్థాగత ప్రణాళికే కారణమని తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ప్రక్షాళన ప్రక్రియను పార్టీ అధిష్టానం ఏడాది కిందటే ప్రారంభించింది. జనవరి 2024లో ఎమ్మెల్యే కోటా కింద ఎమ్మెల్సీగా ఎన్నికైన బి. మహేష్ కుమార్ గౌడ్‌కు సెప్టెంబర్ 2024లో టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత కీలక పదవుల్లో ప్రజాప్రతినిధులకు పెద్దపీట వేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షులుగా నల్గొండ ఎంపీ కె.రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయని రాజేందర్ రెడ్డి, సి.వంశీకృష్ణలకు కట్టబెట్టింది. అలాగే టీపీసీసీ ప్రధాన కార్యదర్శులుదా ఎమ్మెల్యేలు వేద్మ బొజ్జు, డాక్టర్ చిట్టెం పరిణికా రెడ్డి, డాక్టర్ మట్ట రాగమయిలను నియమించింది..పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్ష పదవులను కూడా ప్రజాప్రతినిధులకే కేటాయించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్యను టీపీసీసీ ఓబీసీ సెల్ ఛైర్మన్‌గా, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను ఎస్సీ సెల్ ఛైర్మన్‌గా, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌ను ఎస్టీ సెల్ అధిపతిగా నియమించారు. నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవికి టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ బాధ్యతలు వహించారు. తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పరిణికా రెడ్డి పేరును పరిశీలించినప్పటికీ, వ్యక్తిగత కారణాలతో ఆమె తిరస్కరించడంతో వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణను ఆ పదవిలో నియమించారు. ఇటీవల భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్‌గా నియమించగా, జిల్లా స్థాయిలోనూ ఐదుగురు ఎమ్మెల్యేలను డీసీసీ అధ్యక్షులుగా నియమించారు. వారిలో బీర్ల ఐలయ్య, మేడిపల్లి సత్యం, చిక్కుడు వంశీకృష్ణ, వేద్మ బొజ్జు , ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఉన్నారు. ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు పార్టీ బాధ్యతలు ఇవ్వడం వెనుక ఉన్న సామాజిక, రాజకీయ కారణాలను టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్షాల విమర్శలను, ఆరోపణలను బలంగా ఎదుర్కోవాలంటే అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు ముందుకు రావడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. పవర్ ఉన్న నేతలు కౌంటర్ ఇచ్చినప్పుడే దానికి ప్రాధాన్యత, విలువ ఉంటాయి. పదవులతో పాటు జవాబుదారీతనం, బాధ్యత పెరుగుతాయి. ఇది క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతుందనేది కాంగ్రెస్ పార్టీ ఆలోచనగా ఉంది. పార్టీ అధిష్టానం త్వరలోనే ఎంపీలు లేదా ఎమ్మెల్యేల నుంచి కనీసం ఇద్దరిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా నియమించే ఆలోచనలో ఉంది. ప్రస్తుతం కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ పేర్లు ఈ రేసులో బలంగా వినిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో కేవలం పార్టీ పదవులే కాకుండా, ప్రభుత్వం తరఫున ఇచ్చే పలు కీలక నామినేటెడ్ పోస్టులను కూడా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అప్పగించి, పార్టీ సంస్థాగత పునాదులను రాష్ట్రవ్యాప్తంగా మరింత పటిష్టం చేయాలనేది కాంగ్రెస్ ప్రణాళిక

# మూర్ఛబాధితులకు అండగా నిలుద్దాం..!

మానవ శరీరంలో అత్యంత సంక్లిష్టమైన అవయవం మెదడు. కోట్లాది నాడీ కణాల సమన్వయంతో సాగే ఈ జీవయంత్రంలో తలెత్తే స్వల్ప విద్యుత్ అసమతుల్యత వ్యక్తి జీవితాన్నే తలకిందులు చేస్తుంది. అటువంటి ఒక నాడీ సంబంధిత దీర్ఘకాలిక సమస్యే 'మూర్ఛవ్యాధి'. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు ఐదు కోట్ల మందిని పీడిస్తున్న ఈ రుగ్మత, కేవలం శారీరక సమస్యగానే కాకుండా సామాజిక వివక్షకు, మానసిక వేదనకు కారణమవుతోంది. ప్రతి సంవత్సరం మార్చి 26వ తేదీన నిర్వహించే 'ప్రపంచ మూర్ఛవ్యాధి అవగాహన దినోత్సవం' (పర్పుల్ డే)ఈ వ్యాధిపట్ల ఉన్న అజ్ఞానపు పొరలను తొలగించి, బాధితులకు గౌరవప్రదమైన జీవితాన్ని అందించడమే లక్ష్యంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో, మూర్ఛవ్యాధి మూలాలు, చికిత్సా పద్ధతులు, సామాజిక బాధ్యతలపై లోతైన విశ్లేషణ అవసరం. వైద్యపరిభాషలో మూర్ఛవ్యాధిని ఒక వ్యాధిగా కంటే ఒక లక్షణాల సముదాయంగా పరిగణించడం సముచితం. మెదడులోని నాడీ కణాలు అసాధారణంగా, అతివేగంగా విద్యుత్ సంకేతాలను విడుదల చేసినప్పుడు శరీర నియంత్రణ తప్పుతుంది. దీనినే 'సీజర్' లేదా 'ఫిట్స్' అంటారు. అయితే, ఒకసారి ఫిట్స్ వచ్చిన ప్రతి వ్యక్తి మూర్ఛవ్యాధిగ్రస్తుడు కాడు. ఎటువంటి ప్రేరణ లేకుండా పునరావృతమయ్యేలా ఫిట్స్ వస్తేనే దానిని 'ఎపిలెప్సీ'గా నిర్ధారిస్తారు. గణాంకాలను పరిశీలిస్తే, ప్రపంచంలోని మూర్ఛ బాధితుల్లో సుమారు 80 శాతం మంది అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే ఉండటం గమనార్హం. భారతదేశంలో దాదాపు 1.2 కోట్ల మంది ఈ సమస్యతో పోరాడుతున్నారని అంచనా. ఈ సంఖ్య కేవలం ఒక అంకె మాత్రమే కాదు, దీని వెనుక కొన్ని కోట్ల కుటుంబాల ఆవేదన దాగి ఉంది. చరిత్ర పుటలను తిరగేస్తే, మూర్ఛవ్యాధి గురించి ప్రాచీన నాగరికతల్లోనే ప్రస్తావనలు ఉన్నాయి. కానీ, ఆ కాలంలో దీనిని వైద్య సమస్యగా కాకుండా దైవశాపం గానో, చేతబడి వంటి క్షుద్ర శక్తుల ప్రభావం గానో భావించేవారు. గ్రీకు వైద్య పితామహుడు హిపోక్రటీస్ క్రీస్తుపూర్వమే దీనిని 'పవిత్ర వ్యాధి' కాదని, ఇది మెదడుకు సంబంధించిన జబ్బు అని ప్రపంచానికి చాటిచెప్పాడు. అయినప్పటికీ, శతాబ్దాల తరబడి కొనసాగిన మూఢ నమ్మకాలు నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో వేళ్లూనుకుని ఉన్నాయి. బాధితులను సామాజికంగా వెలివేయడం, వివాహాలకు అనర్హులుగా ప్రకటించడం, ఉపాధి అవకాశాలు నిరాకరించడం వంటి చర్యలు వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. మూర్ఛవ్యాధి రావడానికి కారణాలు బహుముఖంగా ఉంటాయి. శిశువు గర్భంలో ఉన్నప్పుడు లేదా ప్రసవ సమయంలో ఆక్సిజన్ అందకపోవడం వల్ల మెదడు దెబ్బతినడం ప్రాథమిక కారణం కావచ్చు. అలాగే వయస్సు పెరిగే కొద్దీ మెదడుకు తగిలే గాయాలు, ట్యూమర్లు, ఇన్ఫెక్షన్లు (మెనింజైటిస్ వంటివి), స్ట్రోక్ వంటివి ఈ వ్యాధికి దారితీస్తాయి. సుమారు 50 శాతం కేసుల్లో జన్యుపరమైన కారణాలు కూడా ఉండవచ్చు. అయితే, విచారకరమైన విషయం ఏమిటంటే, సగానికి పైగా కేసుల్లో ఖచ్చితమైన కారణం ఇప్పటికీ అన్వేషణలోనే ఉంది. లక్షణాల విషయానికి వస్తే, మూర్ఛ అంటే కేవలం కిందపడి చేతులు కాళ్లు కొట్టుకోవడం మాత్రమే కాదు. ఒక్క క్షణం పాటు శూన్యంలోకి చూడటం, తెలియకుండానే పెదవులు చప్పరించడం, మాట తడబడటం వంటివి కూడా మూర్ఛ లక్షణాలే కావచ్చు. అందుకే వీటిని గుర్తించడంలో అప్రమత్తత అవసరం. చికిత్స విషయంలో ప్రపంచ వ్యాప్తంగా అద్భుతమైన పురోగతి లభించింది. ఆధునిక వైద్యశాస్త్రం అందించిన ఈఈజీ , ఎంఆర్ఐ వంటి పరీక్షల ద్వారా మెదడులో సమస్య ఎక్కడ ఉందో ఖచ్చితంగా తెలుసుకోవచ్చు. బాధితుల్లో 70 శాతం మందికి కేవలం క్రమబద్ధమైన మందుల వాడకం ద్వారా మూర్ఛను పూర్తిగా నియంత్రించే అవకాశం ఉంది. కొన్ని తీవ్రమైన కేసుల్లో శస్త్రచికిత్స లేదా వేగస్ నర్వ్ స్టిమ్యులేషన్ వంటి ఆధునిక పద్ధతులు ప్రాణదాతలుగా నిలుస్తున్నాయి. కానీ, విచారకరమైన వాస్తవం ఏమిటంటే, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 70 శాతం మంది బాధితులకు సరైన మందులు అందుబాటులో లేవు. ఆర్థిక స్తోమత లేకపోవడం ఒక కారణమైతే, మూఢనమ్మకాలతో నాటు మందులు, మంత్రగాళ్ల చుట్టూ తిరగడం మరొక కారణం. మూర్ఛవ్యాధి పట్ల సమాజం తన వైఖరిని మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. బాధితులకు ఫిట్స్ వచ్చినప్పుడు జనం భయాందోళనలకు గురవుతుంటారు. ఆ సమయంలో రోగి నోట్లో చెంచాలు పెట్టడం, ఇనుప వస్తువులు చేతిలో ఉంచడం, మొఖంపై నీళ్లు చల్లడం వంటివి అస్సలు చేయకూడదు. రోగిని సురక్షితంగా ఒక పక్కకు తిప్పి పడుకోబెట్టాలి.

శ్వాస సరిగ్గా ఆడేలా చూడాలి. సాధారణంగా మూర్ఛ రెండు నిమిషాల్లో తగ్గిపోతుంది. అంతకు మించి సమయం తీసుకుంటే వెంటనే ఆసుపత్రికి తరలించాలి. ఈ ప్రాథమిక అవగాహన ప్రతి ఒక్కరిలో ఉంటే బాధితులకు ఎంతో మేలు జరుగుతుంది. విద్య, ఉద్యోగ రంగాల్లో మూర్ఛ వ్యాధిగ్రస్తులను చిన్నచూపు చూడటం మానవ హక్కుల ఉల్లంఘనే అవుతుంది. ఈ వ్యాధి ఉన్నవారు కూడా మేధావులుగా, క్రీడాకారులుగా, కళాకారులుగా రాణించగలరు. చరిత్రలో జూలియస్ సీజర్, సర్ ఐజాక్ న్యూటన్, విన్సెంట్ వాన్ గోహ్ వంటి అసాధారణ వ్యక్తులు మూర్ఛవ్యాధితో ఉండి కూడా ప్రపంచాన్ని ప్రభావితం చేసినవారే. సరైన చికిత్స పొందుతున్న వారు డ్రైవింగ్, భారీ యంత్రాల నిర్వహణ వంటి కొన్ని పరిమితులు మినహా మిగిలిన అన్ని పనులను ఇతరుల వలె సాధారణంగా చేసుకోగలరు.

# డీఎస్సీపై ఒంటరి పోరు!



**గుంటూరు**: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డీఎస్సీ 2025 పై ఉద్యమం చేపడుతోంది. అయితే ఈ ఉద్యమం విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏం ఆశిస్తుందో తెలియడం లేదు కానీ.. ప్రజల్లోకి ఈ అంశం వెళ్లడం లేదు. పైగా కొన్ని వర్గాలు వ్యతిరేకిస్తున్నాయి. సమాజంలో అస్థిరతను, గందరగోళాన్ని సృష్టించేందుకే డీఎస్సీ పై విష ప్రచారం చేస్తున్నారు అంటూ కొంతమంది మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వాన్ని వ్యతిరేకించే న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ సైతం ఈ విషయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీరును తప్పుపట్టారు. ఇప్పుడు జాతీయ పార్టీ కాంగ్రెస్ సైతం దీనిని తీవ్రంగా తప్పుపడుతోంది. వేలాదిమంది ఉపాధ్యాయుల్లో అశాంతి నింపడమే అవుతుందని తేల్చి చెబుతోంది. ప్రజా సమస్యలు గాలికి వదిలి డీఎస్సీ 2025 పై విషం చిమ్మడంపై తీవ్రస్థాయిలో ఆక్షేపిస్తోంది. కేంద్ర మాజీమంత్రి చింతామోహన్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతోపాటు జగన్మోహన్ రెడ్డి తీరుపై మండిపడ్డారు. ఇంత జరిగాక కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోంది. సమకాలీన అంశాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తుంటారు కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డీఎస్సీ పై ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. అదే సమయంలో వేలాది మంది ఉపాధ్యాయులు కర్నూలు కొండారెడ్డి బురుజు సెంటర్ పై ఆత్మగౌరవం పేరుతో నిరసన చేపట్టారు. ఈ క్రమంలో రాయలసీమ వాసిగా.. బాధ్యతాయుతమైన కేంద్ర మాజీ మంత్రిగా స్పందించారు చింతా మోహన్. అసలు డీఎస్సీ పై ఉద్యమం ఎందుకు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఒక్క అక్రమం కూడా జరగలేదని తనకు తెలుసు అని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణ చేసినప్పుడు తాను దీనిపై లోతైన శోధన చేశానన్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రజల్లో అయోమయం సృష్టిస్తామంటే కుదిరే పని కాదని తేల్చి చెప్పారు. అయితే ఒక్క మాట మాత్రం నిజం. ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను దూరం చేసుకుంటుంది. ప్రస్తుతం ఉపాధ్యాయ వర్గాన్ని దూరం చేసుకుంది. ఇంకోవైపు తనతో కలిసివచ్చే రాజకీయ పక్షాలు లేకుండా చేసుకుంటుంది. చింతా మోహన్ కేంద్ర మాజీ మంత్రి హోదాలో.. కాంగ్రెస్ పార్టీకి వీర విధేయుడు హోదాలో మాట్లాడుతారు. ఇప్పుడు అటువంటి వ్యక్తి డీఎస్సీలో అక్రమాలు జరగలేదని.. వైయస్సార్ కాంగ్రెస్ పోరాటాన్ని తప్పుపట్టారు. అయితే చింతా మోహన్ మాదిరిగా మరి కొంతమంది ముందుకు వచ్చే అవకాశం ఉంది.

# యూపీలో షాకింగ్ రిజల్ట్స్..

**లక్నో,** : ఉత్తర్ ప్రదేశ్ లో వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలు కేంద్రంలో బీజేపీకి చావో రేవో అన్నట్లు మారాయి. కాక్రోచ్ ఉద్యమం తర్వాత దేశంలో మారిన పరిస్థితుల్లో ఓటర్లు తమవైపే ఉన్నారని చెప్పుకునేందుకు ఈ ఎన్నికలు కీలకంగా మారాయి. ఇందులో గెలిస్తేనే 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ గెలిచే అవకాశాలు ఉంటాయి. అలా జరగకపోతే మాత్రం బీజేపీ పతనం ప్రారంభమైనట్లే భావించవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో యూపీ ఓటరు నాడిపై పోల్ ట్రాకర్ నిర్వహించిన ఒపీనియన్ పోల్ లో సంచలన ఫలితాలు వెలువడ్డాయి. యూపీలో ప్రాంతాల వారీగా పోల్ ట్రాకర్ నిర్వహించిన ఒపీనియన్ పోల్ ఫలితాలను ఇవాళ సాయంత్రం దశల వారీగా ఎక్స్ లో ట్వీట్లు చేస్తోంది. ఇందులో ముందుగా పూర్వాంచల్ ప్రాంతంలోని 133 సీట్లలో నిర్వహించిన సర్వేలో ఇండియా కూటమికి 73 సీట్లు, ఎన్డీయేకుకు 56 సీట్లు దక్కుతాయని తేలింది. బీఎస్పీకి 3 సీట్లు, ఇతరులకు ఒక సీటు దక్కనున్నాయి. అలాగే అవధ్ ప్రాంతంలోని 82 సీట్లలో నిర్వహించిన సర్వేలో ఇండియా కూటమికి 45 సీట్లు, ఎన్డీయే కూటమికి 35 సీట్లు దక్కుతున్నట్లు తేలింది. బీఎస్పీ 2 సీట్లు సాధించే అవకాశం ఉంది. ఈ రెండు ప్రాంతాల్లోనూ ఇండియా కూటమికి 44-49 శాతం ఓట్లు, ఎన్డీయేకు 39-45 శాతం ఓట్లు లభిస్తున్నాయి పశ్చిమ యూపీ ప్రాంతంలోని 79 సీట్లలో నిర్వహించిన ఒపీనియన్ పోల్ లో ఇండియా కూటమికి 48 సీట్లు, ఎన్డీయేకు 34 సీట్లు, బీఎస్పీకి రెండు సీట్లు రాబోతున్నట్లు తేలింది. ఇక్కడ కూడా రెండు కూటముల ఓట్ల శాతాల్లో మిగతాప్రాంతాలతో పోలిస్తే ఎలాంటి మార్పు లేదు. బ్రజ్ ప్రాంతంలో ఉన్న 56 సీట్లలో ఇండియా కూటమికి 31 సీట్లు, ఎన్డీయే కూటమికి 24 సీట్లు రాబోతున్నట్లు తేలింది. బీఎస్పీకి ఇక్కడ ఒక సీటు రానుంది. అలాగే బుందేల్ ఖండ్ ప్రాంతంలో ఉన్న 53 సీట్లలో ఇండియా కూటమికి 28 సీట్లు, ఎన్డీయే కూటమికి 22 సీట్లు, బీఎస్పీకి ఒక సీటు వస్తుందని సర్వే తేల్చింది. ఈ లెక్కన ఇండియా కూటమికి 225 సీట్లు రాబోతున్నట్లు అంచనా వేసింది. ఎన్డీయే కూటమికి కేవలం 171 సీట్లు రాబోతున్నట్లు సర్వే తేల్చింది. బీఎస్పీకి 9 సీట్లు వస్తున్నట్లు తేలింది. యూపీ అసెంబ్లీలో 403 సీట్లలో అధికారానికి కావాల్సిన మ్యాజిక్ మార్క్ 202 సీట్లు. కాబట్టి ఇండియా కూటమి గెలుస్తుందని సర్వే అంచనా వేసింది.



# తీరుమారని యూజీసీ నెట్ ఎగ్జామ్ రద్దు



**న్యూఢిల్లీ,** : యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ జూన్ 2026 పరీక్షలకు సంబంధించి ఏకంగా మూడు సబ్జెక్టులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ రద్దు చేసింది. ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలను తిరిగి నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మూడు పేపర్లలో పలు తప్పులు, లోపాలు ఉన్నాయంటూ అభ్యర్థుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. జూన్ 2026 పరీక్షలను జూన్ 22 నుంచి 30 వరకు నిర్వహించిన సంగతి తెలిసిందే. అనంతరం జూలై 5, 2026న రీ-టెస్ట్ నిర్వహించింది. మొత్తం 87 సబ్జెక్టులకు ఈ పరీక్షలు జరిగాయి. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ , అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత, పీహెచ్‌డీ ప్రవేశాల కోసం ఈ పరీక్షను నిర్వహిస్తారు. అయితే ఇందులో ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ పేపర్లలో అనేక తప్పులు ఉన్నాయని బొంకు అభ్యర్థుల నుంచి ఫిర్యాదులు అందాయి. దీంతో ఈ లోపాలను పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ సమగ్రంగా పరిశీలించిన అనంతరం మూడు పేపర్లలో పలు రకాల తప్పులు ఉన్నట్లు గుర్తించింది. కమిటీ నివేదిక ప్రకారం.. ప్రశ్నపత్రాల్లో ప్రముఖ పండితుల పేర్లలో స్పెల్లింగ్ తప్పులు, పుస్తకాల పేర్లలో లోపాలు, ప్రశ్నల పదబంధాల్లో తప్పులు, వ్యాకరణ దోషాలు, లింగం-వచన అన్వయంలో పొరపాట్లు, విరామ చిహ్నాల తప్పులు ఉన్నాయి. అంతేకాకుండా ఇప్పటికే ప్రాచుర్యంలో ఉన్న భావాలకు ప్రామాణికం కాని పదాలను ఉపయోగించడం, గతంలో అడిగిన ప్రశ్నల్లో గణనీయమైన సంఖ్యలో ప్రశ్నలను మళ్లీ ఇవ్వడం వంటి లోపాలు కూడా ఉన్నట్లు కమిటీ గుర్తించింది. అభ్యర్థులందరికీ న్యాయమైన, లోపాలు లేని పరీక్షను నిర్వహించడం అవసరమని భావించిన కమిటీ.. ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ మూడు పేపర్లను తిరిగి నిర్వహించాలని సిఫార్సు చేసింది. కమిటీ నివేదిక ఆధారంగా రీ-కండక్ట్‌కు నిర్ణయం తీసుకుంది.

ఇంగ్లిష్ పరీక్ష తేదీ: సెప్టెంబర్ 9, 2026 ? షిఫ్ట్ 1, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

కామర్స్ పరీక్ష తేదీ: సెప్టెంబర్ 9, 2026 ? షిఫ్ట్ 2, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు

సోషియాలజీ పరీక్ష తేదీ: సెప్టెంబర్ 10, 2026 ? షిఫ్ట్ 1, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ మూడు సబ్జెక్టులకు చెందిన అభ్యర్థుల నుంచి రీ-కండక్ట్ పరీక్ష కోసం ఎలాంటి అదనపు పరీక్ష ఫీజు వసూలు చేయబోమని స్పష్టం చేసింది. పరీక్ష నగరం, పరీక్ష కేంద్రం, అడ్మిట్ కార్డుకు సంబంధించిన వివరాలను తదుపరి దశలో అధికారిక వెబ్‌సైట్ ద్వారా వెల్లడిస్తామని తెలిపింది. మరోవైపు సబ్జెక్టులకు సంబంధించిన ప్రొవిజనల్ ఆన్సర్ కీలను విడుదల చేసింది. ఈ 84 సబ్జెక్టులకు సంబంధించిన ఫలితాలను నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే ప్రకటిస్తామని తెలిపింది. అలాగే ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టులకు రీ-కండక్ట్ పరీక్ష నిర్వహిస్తున్న కారణంగా మిగిలిన 84 సబ్జెక్టులకు సంబంధించిన సీట్ల కేటాయింపు, ఈ-సర్టిఫికెట్ల జారీ ఆలస్యం కాదని స్పష్టం చేసింది. అభ్యర్థులు రీ-కండక్ట్ పరీక్షకు సంబంధించిన తాజా సమాచారం, పరీక్ష కేంద్రం, సిటీ ఇంటిమేషన్ స్లిప్, అడ్మిట్ కార్డు వంటి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను క్రమం తప్పకుండా పరిశీలించాలని సూచించింది.

## ఆంధ్ర నేతల మోచేతి నీళ్లు తాగే వారు నేడు ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవిస్తున్నారు : ఎమ్మెల్యే కొమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేని వారు, ఆంధ్ర నాయకుల మోచేతి నీళ్లు తాగే వారు నేడు ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవిస్తుండటం బాధాకరమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను ప్రతిపక్షంలో ఉన్నా, అధికార పక్షంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడతానని స్పష్టం చేశారు. రవీంద్రభారతిలో కళాకారుడు ఏపూరి సోమన్న 25 ఏళ్ల పాటల ప్రస్థానంపై రూపొందించిన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి రాజగోపాల్‌రెడ్డి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తొలిసారిగా గళం విప్పింది తానేనని, అందుకే అప్పటి సీఎం కేసీఆర్ తనను లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. మునుగోడు ఉపఎన్నికలో తనను ఓడించేందుకు 100 మంది ఎమ్మెల్యేలను రంగంలోకి దించినా, దానిని కూడా తాను ఒక విజయంగానే భావిస్తున్నానని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి పేరుతో లక్షల కోట్ల రూపాయలను దోచుకుంటోందని ఆయన ఆరోపించారు. ఏపూరి సోమన్న పాడిన 'ఎవరి పాలైందిరో తెలంగాణ' పాటలో ప్రస్తావించిన పరిస్థితులే నేటికీ కొనసాగడం బాధాకరమన్నారు. సోమన్న రూపం, గళం చూస్తే దివంగత ప్రజాగాయకుడు గద్దర్ గుర్తుకొస్తారని పేర్కొన్నారు. ఏపూరి సోమన్న వంటి కళాకారులు, ఉద్యమకారులకు తాను అండగా ఉంటానని, వచ్చే ఎన్నికల్లో సోమన్న చట్టసభల్లో అడుగుపెడతారని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. రాజకీయాలను మార్చే శక్తి తనకు ఉందని, నిజాయితీ కలిగిన వారు తన వెంట నిలిస్తే తమిళనాడు తరహాలో రాజకీయ మార్పు తీసుకురాగలమని ధీమా వ్యక్తం చేశారు. తాను గెలిపించిన ఓ ఎమ్మెల్యే కులం కార్డును అడ్డుపెట్టుకుని అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. పదవులు కిరీటాలు కావని, ప్రజలకు సేవ చేసే అవకాశం మాత్రమేనని రాజగోపాల్‌రెడ్డి హితవు పలికారు.

# మిల్లర్ల గోడు వినేది ఎవరు

## బియ్యం రాక మిల్లర్ల నరకయాతన - ధాన్యం కొనుగోలు మిల్లర్లు చేస్తేనే మేలు



హన్మకొండ : ప్రభుత్వం నిర్దేశించిన బియ్యం దిగుబడి రాక మిల్లర్లు నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం మిల్లర్ల మెడపై కత్తి పెట్టి ధాన్యం దిగిమతి చేయిస్తుందన్నారు. ఎవరో కొంతమంది మిల్లర్లు చేసిన పొరపాటు వలన జిల్లాలోని మిల్లర్లు అందరిపై ఆర్థిక భారం పడుతుందని దాని వలన ఆయా కుటుంబాలు మనోవేదనకు గురవుతున్నాయని కొంతమంది మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం మిల్లర్ల వద్ద నుండి బ్యాంకు డిపాజిట్ పేరుతో లక్షల రూపాయలని ముందస్తుగా వసూలు చేస్తుందన్నారు. బ్యాంకులలో డిపాజిట్ చేసిన మిల్లర్లకే ప్రభుత్వం ధాన్యం దిగుమతికి అవకాశం ఇస్తుందని వారు వాపోతున్నారు. ఇటీవల హన్మకొండ జిల్లాలోని శాయంపేట మండలంలోని రైస్ మిల్ పై సంబంధిత అధికారులు దాడి చేసి ధాన్యం లోటును గుర్తించారు. ఆ క్రమంలో ఆ మిల్లుల నిర్వహకులను ఇటీవల జైలుకు పంపిన విషయం తెలిసింది. 2024 , 2025 , 2026 సంవత్సరానికి గాను ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయి. దీంతో ఆ మిల్లులు ప్రభుత్వం ఐకెపి ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని దిగుమతి దిగుమతి చేసుకున్నాయి. వర్షాకాలంలో దిగుమతి చేసుకున్న వారి ధాన్యం నాణ్యత పరంగా బాగుంటుందని మిల్లర్లు అంటున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నిర్దేశించిన ప్రతి క్వింటల్ ధాన్యానికి 68 కిలోల బియ్యం రావడం కష్టమని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రతి మిల్లరు ఆ లోటును పూడ్చడానికి తీవ్రంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితిలు ఉన్నాయని అంటున్నారు. ఒక్కోసారి ఆ లోటును పూడ్చలేక ఇల్లు భూములు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని మిల్లర్లో అంటున్నారు. ఎంత ఎక్కువగా ధాన్యాన్ని దిగిన చేసుకుంటే అంత ఎక్కువగా నష్టపోయే పరిస్థితులు ఉన్నాయని వారు తెలిపారు. ధాన్యాన్ని పట్టే సమయంలో వచ్చే తౌడు , ఉను క ,నూకలు , పరం లాంటి వస్తువులను బయట అమ్మి లోటును పూడ్చవలసిన దుస్థితి ఏర్పడుతుందని మిల్లర్లు అంటున్నారు. ధాన్యాన్ని పట్టే క్రమంలో విద్యుత్ చార్జీ మిల్లులో పనిచేసే కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితులు ఉంటున్నాయని మిల్లర్లు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం ఇస్తున్న కమిషన్ సకాలంలో మిల్లర్లకు అందించినట్లయితే నెత్తిపై పడే భారాన్ని కాసింత తగ్గించుకోవచ్చని మిల్లర్లు తెలిపారు.

**ధాన్యం కొనే అవకాశం మిల్లులకే ఇవ్వాలి.**

రైతులు పండించిన పరిధాన్యాన్ని కకొనుగోలు చేసే అవకాశం మిల్లులకు ఇవ్వాలని మిల్లర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దానివలన నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని మిల్లర్లు తెలిపారు. కనీస మద్దతు ధర నిర్ణయించి ప్రభుత్వం మిల్లర్లు వచ్చే కొనే అవకాశం ఇచ్చినట్లయితే నష్టం తాలూకు భారాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఐకేపీ ద్వారా కొనే విధానం వలన కొన్ని సెంటర్లలో రాజకీయ ప్రమేయాలు చోటుచేసుకుని నాణ్యమైన ధాన్యం దిగుమతి కాకుండా పోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంతో పోలిస్తే నాణ్యమైన ధాన్యాన్ని రైతులు మిల్లర్ల వద్దకు తేవడం లేదని పేర్కొన్నారు. రైతుల పండించిన ధాన్యం కొనుగోలు సమయంలో మిల్లర్లు నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వం నిర్దేశించిన ధర ప్రకారం కొనుగోలు చేయకపోయినా వాటి అనుమతులను రద్దు చేయాలని కొంతమంది మిల్లర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నారు. రైతులు ధాన్యం పూర్తిగా ఎండకు ముందే మిల్లర్లకు తేవడం వల్ల వాటిలో దిగుమతి రావడం లేదని పేర్కొన్నారు. డిపాజిట్ రూపంలో అదనపు భారం. ధాన్యం దిగుమతి చేసుకోవాలంటే ప్రతి మిల్లర్ విధిగా బ్యాంకులో డిపాజిట్ చేయాలన్న నిబంధన మిల్లర్ల పాలిట గుదిబండగా మారింది అంటున్నారు. దిగుమతి చేసుకున్న ధాన్యములో 10% బ్యాంకులో డిపాజిట్ చేస్తేనే ప్రభుత్వం అనుమతినిస్తుందని వారు తెలిపారు. మిల్లుల నిర్వహణ గతంతో పోలిస్తే కష్టసాధ్యంగా మారిందని యజమానులు ఆపోతున్నారు. రైతులకు నష్టం జరగకుండా మిల్లు యజమానులకు నష్టాలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంటుందని కొంతమంది మిల్లర్లు అంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మిల్లర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ మహాత్మ బసవేశ్వర విగ్రహ ఆవిష్కరణ



**రంగారెడ్డి :** షాద్‌నగర్‌లో వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో, బొబ్బిలి ప్రవీణ్ నేతృత్వంలో శ్రీ మహాత్మ బసవేశ్వర స్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ... మహనీయుడు, భగవత్ స్వరూపుడైన శ్రీ మహాత్మ బసవేశ్వర స్వామి విగ్రహాన్ని షాద్‌నగర్‌లో ప్రతిష్ఠించడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమానికి కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య హాజరు కావడం మరింత ప్రత్యేకతను సంతరించుకుందని తెలిపారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజం పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు. బసవేశ్వరుడు కారణజన్ముడని, సమాజంలోని అసమానతలను తొలగించేందుకు తన జీవితాన్ని అంకితం చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. లింగ,మత,కుల వివక్షకు తావులేకుండా సమాజంలో ప్రతి ఒక్కరూ సమానమే అనే భావనను ఆయన ఆనాడే చాటిచెప్పారని అన్నారు. మానవత్వంతో మెలుగుతూ సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలన్న బసవేశ్వరుడి సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. ఆయన ఆశయాలను పాటిస్తే సమాజంలో శాంతి, సమానత్వం నెలకొంటాయని పేర్కొన్నారు. కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం అధ్యక్షతన శ్రీ మహాత్మ బసవేశ్వర స్వామి విగ్రహావిష్కరణ జరగడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి భక్తుడిపై కాశీ విశ్వేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. మహాత్మ బసవేశ్వరుడు దేవుడి స్వరూపంగా జన్మించి సమాజాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు గొప్ప కార్యక్రమాన్ని చేపట్టారని జగద్గురు కొనియాడారు. ఆయన చూపిన మార్గం కేవలం కర్ణాటక రాష్ట్రానికే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా సమాజ అభ్యున్నతికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. స్త్రీ, పురుష భేదం లేకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ సమానమే అనే బసవేశ్వరుడి సిద్ధాంతాలను ప్రజలు ఆచరించాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ నుంచి చిన్నచిన్న గ్రామాల వరకు ప్రముఖ క్షేత్రాలు, ప్రాంతాల్లో బసవేశ్వరుని విగ్రహాలు ఉండాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. షాద్‌నగర్‌లో బసవేశ్వర విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేసిన బొబ్బిలి ప్రవీణ్, వీరశైవ లింగాయత్ సమాజం ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజం నాయకులు, పెద్దలు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కంచుకోటలో సవాళ్లు...!



**అనంతపురం :** ఉమ్మడి అనంతపురం జిల్లా ఒకప్పుడు తెలుగుదేశం పార్టీకి కంచు కోటగా గుర్తింపు పొందింది. రాజకీయ పరిస్థితులు ఎలా మారినా ఈ ప్రాంతంలో పార్టీ తన ప్రభావాన్ని నిలబెట్టుకుంది. 2019 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేసినప్పటికీ, హిందూపురం , ఉరవకొండ వంటి నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపు సాధించింది. 2024 ఎన్నికల్లో కూడా జిల్లా వ్యాప్తంగా పార్టీ మరింత బలపడింది. అయితే ఇప్పుడు జిల్లాలో పార్టీ నాయకత్వం ఆశించినంత చురుకుగా కనిపించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు ఇటీవల రాజకీయ కార్యక్రమాల్లో పెద్దగా కనిపించడం లేదని కార్యకర్తల మధ్య చర్చ జరుగుతోంది. మంత్రి పదవులు లేదా ఇతర కీలక బాధ్యతలు ఆశించిన కొందరికి అవి దక్కకపోవడం, నామినేటెడ్ పోస్టుల భర్తీలో జాప్యం జరగడం వంటి అంశాలు ఈ పరిస్థితికి కారణమయ్యాయనే ప్రచారం ఉంది. అధికారంలో ఉన్నప్పటికీ నాయకులు సమన్వయంతో ముందుకు సాగకపోవడం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక నాయకత్వం తమ తమ వర్గాలకే పరిమితమవుతోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీంతో పార్టీ కార్యక్రమాలు ఒకే దిశగా సాగడం లేదని పరిశీలకులు చెబుతున్నారు. నాయకుల మధ్య సమన్వయం బలహీనంగా ఉండటం వల్ల కేడర్‌లో కూడా కొంత నిరుత్సాహం కనిపిస్తోందని స్థానికంగా చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించిన ఇంటింటికీ కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఒకే స్థాయిలో అమలు చేయడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ , కాల్వ శ్రీనివాసులు ప్రాతినిధ్యం వహిస్తున్న రాయదుర్గం నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం కొంత చురుకుగా సాగుతున్నప్పటికీ, మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం ఆశించిన వేగం కనిపించడం లేదని పార్టీ వర్గాలే అంటున్నాయి. చాలా చోట్ల ఇంటింటికీ కార్యక్రమం కంటే సమావేశాలు, సమన్వయ చర్చలు, కార్యకర్తల నియామకాలపైనే ఎక్కువ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో ప్రజల్లో పార్టీ కార్యక్రమాల ప్రభావం తగ్గే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కువ మంది సీనియర్ నాయకులు ఉండటం కూడా సమన్వయానికి సవాలుగా మారిందని అంటున్నారు. ప్రతి నాయకుడు తన రాజకీయ ప్రాధాన్యతను నిలబెట్టుకోవాలనే ప్రయత్నంలో ఉండటంతో కొన్ని చోట్ల అంతర్గత పోటీ పెరిగినట్లు కనిపిస్తోంది. ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతల మధ్య అభిప్రాయ భేదాలు కూడా అప్పుడప్పుడు బయటపడుతున్నాయని సమాచారం. ముఖ్యంగా తాడిపత్రి, హిందూపురం , పెనుకొండ వంటి కీలక నియోజకవర్గాల్లో స్థానిక రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారాయి.

# కూటమిలో ఏం జరుగుతోంది




**విజయవాడ,** : తెలుగు రాష్ట్రాల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత , పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి బాధ్యత చేపట్టడం ఆయన అభిమానులకు గర్వ కారణం. అయితే పవన్ కళ్యాణ్ కేవలం ఆ పదవి ని అలంకరణ కోసం వాడుకోకుండా, తానూ బాధ్యత చేపట్టిన శాఖలకు నూటికి నూరు శాతం న్యాయం చేస్తున్నాడు. వైసీపీ పార్టీ ప్రభుత్వ హయాం లో 24 వ స్థానం లో ఉన్న ఈ శాఖ, ఇప్పుడు మొదటి స్థానానికి చేరుకుందంటే పవన్ కళ్యాణ్ పని తీరు ఏ రేంజ్ లో ఉందో అర్థం చేసుకోవచ్చు. గ్రామా సభలు ఏర్పాటు చేసి, గ్రామాల్లోని ప్రజలు చేత వాళ్లకు అవసరమయ్యే పనులన్నీ కలెక్టర్ల దృష్టికి చేర్చి, పల్లె పండుగ పేరుతో రెండు విడతల్లో పవన్ కళ్యాణ్ ఈ స్థాయి ఫలితాలను అందుకున్నాడు. అభిమానులు ఎంతసేపు సినిమా ఫ్యాన్ వార్స్ లో దూరి రికార్డ్స్ కోసం కొట్లాడుకోవడం కాకుండా, ఇలాంటి విషయాలను జనాల్లోకి తీసుకెళ్తే నాయకుడిగా పవన్ కళ్యాణ్ ఇమేజ్ ఎక్కడికో వెళ్తుంది అంటూ సోషల్ మీడియా లో రాజకీయ విశ్లేషకులు కామెంట్స్ చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే కేంద్ర ప్రభుత్వం ఆద్వర్యం లో ప్రతీ ఏడాది దీనదయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సేతత్ వికాస్ జాతీయ సంస్థ గ్రామీణాభివృద్ధి, నీటి సంరక్షణ , పారిశుద్యం విభాగాల్లో పురస్కారాలను అందిస్తూ ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే పంచాయితీ రాజ్ శాఖ లో అవార్డులు అందుకుంది. ఇప్పుడు వరుసగా రెండవసారి కూడా అవార్డులను అందుకోవడం విశేషం. ఈ సంవత్సరం అయితే పంచాయితీ రాజ్ శాఖ ఏకంగా 5 విభాగాల్లో అత్యుత్తమ ర్యాంక్ అందుకుంది. గుడ్ గవర్నెన్స్ విభాగం లో శృంగవరం పంచాయత్ మొదటి స్థానం లో నిలబడింది. అదే విధంగా వుమెన్ ఫ్రెండ్లీ పంచాయత్ గా బొక్కాసం పాలెం అనే గ్రామం కూడా మొదటి స్థానం లో నిల్చింది. పేదరికం లేని గ్రామంగా, అత్యంత ప్రమాణాలతో జీవనం సాగుతున్న గ్రామం గా చెమ్ములపల్లి పంచాయత్ 2 వ స్థానం లో కొనసాగుతుండగా, సెల్ఫ్ సఫీషియంట్ఇన్ఫ్రా స్ట్రక్చర్ విభాగం లో గుండుమల పంచాయత్ 3వ ర్యాంక్ లో కొనసాగుతుంది. ఇక ఉత్తమ మండలం విభాగం లో అయితే కుప్పం దేశం లోనే 3 వ ర్యాంక్ సాధించింది. ఇలా పవన్ కళ్యాణ్ ఆద్వర్యం లో పంచాయితీ రాజ్ శాఖ ఎప్పుడూ చూడనంత అభివృద్ధిని చూస్తూ దేశంలోనే మన ఆంధ్ర ప్రదేశ్ ని ఆదర్శవంతమైన రాష్ట్రము గా తీర్చి దిద్దాడు పవన్ కళ్యాణ్.

# 148 రోజుల్లోనే డీఎస్సీ నియామకాలు పూర్తి, వైసీపీ విమర్శలకు టీచర్లే కౌంటర్ : లోకేష్



**విజయవాడ,** :ఎంతో బాధ్యతగా తీసుకుని, కేవలం 148 రోజుల్లోనే డీఎస్సీ నియామకాలు పూర్తి చేశామని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాల సందర్భంగా మంత్రి నారా లోకేష్ మెగా డీఎస్సీ–2025 నియామకాలు, విద్యా రంగంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలపై కీలక ప్రసంగం చేశారు. డీఎస్సీ నియామకాలపై శాసనసభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి విమర్శలకు చెక్ పెట్టారు. అసెంబ్లీలో నారా లోకేష్ మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో నిరుద్యోగుల కోసం ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రక్రియను ఎంతో బాధ్యతగా నిర్వర్తిస్తున్నాం. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్ష మేరకు టీచర్ల నియామకాలు, బదిలీలను అత్యంత పారదర్శకంగా నిర్వహించాం. ఇప్పటివరకు టీడీపీ ప్రభుత్వాల హయాంలో మొత్తం 1.80 లక్షల టీచర్ పోస్టులను భర్తీ చేశాం. టీచర్లలో నైపుణ్యాభివృద్ధి పెంచేందుకు కూటమి ప్రభుత్వం వారిని సింగపూర్, ఫిన్‌లాండ్ వంటి విదేశాలకు పంపించాం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీచర్లను మద్యం దుకాణాల వద్ద నిలబెట్టి, వారి గౌరవాన్ని భంగపరిచేలా చేశారని' విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ప్రజలందరికీ పూర్తి స్వేచ్ఛ ఉందని, వ్యవస్థను ఎవరైనా ప్రశ్నించవచ్చని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్ల అమలుపై భిన్నాభిప్రాయాలు ఉన్నవారు కోర్టులను ఆశ్రయించగా, 336 కేసులు నమోదైనప్పటికీ కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని చర్చ సందర్భంగా తెలిపారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా డీఎస్సీలో వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్ విధానాన్ని అమలు చేశామని స్పష్టం చేశారు. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన నియామకాలు అత్యంత పారదర్శకంగా జరగడం వల్లే వేలాది మంది టీచర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రభుత్వానికి అండగా నిలిచారు. ఇందులో భాగంగా వైసీపీ చేస్తున్న విమర్శలను ఖండిస్తూ, విజయవాడలో మెగా డీఎస్సీ ద్వారా నియమితులైన టీచర్లు భారీ ఆత్మగౌరవ ర్యాలీ చేశారని' మంత్రి లోకేష్ వివరించారు.

# మళ్లీ వల్లభనేనికి కోర్టు తిప్పలు



**విజయవాడ, ఆగస్టు 3 :** గన్నవరం నియోజకవర్గ రాజకీయాల్లో మట్టి దోపిడీ వ్యవహారం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. గత ప్రభుత్వ కాలంలో జరిగిన అక్రమాలను ప్రస్తుత ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు బహిర్గతం చేయడం పెద్ద చర్చకు దారితీసింది. పోలవరం కుడి కాలువ మట్టి తవ్వకాలు, ప్రభుత్వ పనుల కాంట్రాక్టులలో సాగిన అవినీతిని ఆయన బయటపెట్టారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పాలనలో జరిగిన ఈ దోపిడీపై విజిలెన్స్ నివేదికలు కూడా స్పష్టమైన నిజాలు వెల్లడించాయి. ఎలాంటి అనుమతులు లేకుండా కోట్ల విలువైన సహజ వనరులను తరలించారని ఆరోపణలు వస్తున్నాయి. నియోజకవర్గ ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యతతోనే తాను ఈ నిజాలను బయటపెట్టానని యార్లగడ్డ గట్టిగా చెబుతున్నారు. ఈ పరిణామాలు స్థానిక రాజకీయాల్లో పెను మార్పులకు కారణం అవుతున్నాయి. అక్రమాలు బయటపడతాయనే భయంతో మాజీ ఎమ్మెల్యే వంశీ లీగల్ నోటీసుల మార్గాన్ని ఎంచుకున్నారు. తన పరువుకు భంగం కలిగిస్తున్నారంటూ ఆయన పంపుతున్న నోటీసులు కేవలం భయపెట్టే ప్రయత్నాలని కూటమి శ్రేణులు మండిపడుతున్నాయి. గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని సాగించిన అరాచకాలను ప్రజలు ఇంకా మరచిపోలేదు. ఇప్పుడు అధికారం కోల్పోయాక చట్టపరమైన ముసుగులో తప్పించుకోవాలని చూడటం సరికాదని విమర్శకులు అభిప్రాయపడుతున్నాయి. కోర్టుల ద్వారా భయపెట్టి నోరు మూయించవచ్చనే ఆలోచన కేవలం భ్రమేనని స్థానిక నాయకులు స్పష్టం చేస్తున్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా ఇలాంటి బెదిరింపులకు పాల్పడటం మాజీ ఎమ్మెల్యే రాజకీయ బలహీనతను స్పష్టంగా బయటపెడుతోంది. బెదిరింపులకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ధైర్యంగా ప్రకటిస్తున్నారు. చట్టబద్ధంగా ఏ వేదికపైనైనా ఈ దోపిడీని నిరూపించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆయన తేల్చిచెప్పారు. కోర్టులకు వెళ్తే అసలు నిజాలు, మట్టి తవ్వకాలకు సంబంధించిన పక్కా ఆధారాలన్నీ బయటకు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించింది నియోజకవర్గాన్ని ప్రక్షాళన చేయడానికే తప్ప ఇలాంటి లీగల్ నోటీసులకు భయపడటానికి కాదని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలోనే తేల్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పడం ద్వారా ఆయన తన పట్టును నిరూపించుకుంటున్నారు. ఈ రాజకీయ పోరు రానున్న రోజుల్లో మరింత ముదిరే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. గన్నవరం నియోజకవర్గ ప్రజలు గత ఐదేళ్ల పాలనలో జరిగిన అన్యాయాలను నిశితంగా గమనించారు. విమానాశ్రయం పరిసరాల్లో జరిగిన పనులలోనూ భారీ అవకతవకలు జరిగాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రాయల్టీ చెల్లించకుండా తరలించిన వేలాది ట్రక్కుల మట్టి లారీలు రోడ్లను ధ్వంసం చేశాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. యువత ఈ విషయాలను సోషల్ మీడియా వేదికగా విశ్లేషిస్తూ నిలదీస్తున్నారు. పాత తప్పులను కప్పిపుచ్చుకోవడానికి లీగల్ నోటీసులు పంపడం పట్ల ప్రజల్లో వ్యంగ్యమైన చర్చ నడుస్తోంది. అభివృద్ధిని విస్మరించి కేవలం అక్రమ సంపాదన మీద దృష్టి పెట్టడం వల్లే నాయకులు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని యువత భావిస్తున్నారు. ఈ పరిణామాలు రాబోయే రాజకీయ సమీకరణాలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. మొత్తానికి గన్నవరం రాజకీయం ప్రస్తుతం అత్యంత రసవత్తరమైన దశకు చేరుకుంది. యార్లగడ్డ వెంకట్రావు దూకుడు వల్ల వంశీ వర్గంలో తీవ్ర ఆందోళన నెలకొంది. అవినీతిని అంతం చేసే వరకు విశ్రమించేది లేదనే సంకేతాలను ప్రస్తుత నాయకత్వం బలంగా ఇస్తోంది. సోషల్ మీడియా ట్రెండ్స్ ప్రకారం చూస్తే ఈ వివాదం ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. ప్రజలు కూడా నిజాలు ఎటువైపు ఉన్నాయో స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారు. రానున్న కాలంలో ఈ పోరు కోర్టుల ద్వారా ఏ మలుపు తిరుగుతుందో చూడాలి. గన్నవరం అభివృద్ధి సాధించాలంటే ఇలాంటి అక్రమాలపై నిరంతరం నిఘా అవసరమని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

# ఆ ఐదుగురిని ఎందుకు సస్పెండ్ చేశారు..!



విజయవాడ : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయింపు కోరుతూ కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులను కలిసిన ఐదుగురు టీచర్లను సస్పెండ్ చేయడంపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, ముఖ్యంగా ఉపాధ్యాయులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ నేడు సోషల్ మీడియా వేదికగా ధ్వజమెత్తారు."మొదటి రోజు వైఎస్సార్ కడప జిల్లా టీచర్ల సంఘం వారిని, రెండో రోజు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల టీచర్లను సస్పెండ్ చేశారు. ఆ ఐదుగురు ఉపాధ్యాయులను ఎందుకు సస్పెండ్ చేశారు? వారు చేసిన నేరం ఏమిటి?" అని జగన్ సూటిగా ప్రశ్నించారు. సర్వీసులో చేరినప్పుడు లేని టెట్ నిబంధనను ఇప్పుడు అమలు చేయడంతో లక్ష మందికి పైగా సీనియర్ టీచర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నిబంధన నుంచి మినహాయింపు కోరుతూ తమకు అండగా నిలిచిన ఎంపీల సహకారంతో కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వడం నేరమా? అని జగన్ నిలదీశారు. తక్షణమే ఉపాధ్యాయుల సస్పెన్షన్లనురద్దు చేసి, వారికి ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు. ఈ అన్యాయమైన సస్పెన్షన్లపై న్యాయపోరాటంలో టీచర్లకు వైసీపీ పూర్తి అండగా ఉంటుందని పేర్కొన్నారు. "మీ రెడ్ బుక్ అరాచక పాలన ఇప్పుడు ప్రభుత్వ ఉపాధ్యాయులను కూడా వదలడం లేదు. చంద్రబాబు గారూ.. నిజానికి మీరే కేంద్ర ప్రభుత్వాన్ని ఈ టెట్ నిబంధనను తొలగించాలని కోరాలి కదా? ఎన్డీఏలో భాగస్వామిగా ఉండి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదు?" అని జగన్ విమర్శించా రు."మీరు చేయాల్సిన పని చేయలేదు. సీనియర్ టీచర్ల సమస్యలను గాలికొదిలేశారు. మా పార్టీ ఎంపీల మద్దతుతో వారు తమ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తే, దానికి రాజకీయ రంగు పులిమి సస్పెండ్ చేశారు. మీరు చేయలేని పనిని వారు చేయడానికి ప్రయత్నించడమే వారి తప్పా? ఒక సమస్యను పరిష్కరించాల్సింది పోయి, దానికి రాజకీయ దురుద్దేశాలు ఆపాదించడం దారుణం. ఇంతగా ఎలా దిగజారిపోయా రు?" అని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ చంద్రబాబు గాలికొదిలేశారని జగన్ ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి మూడో ఏడాది నడుస్తున్నా మధ్యంతర భృతి (ఐఆర్), పీఆర్సీ హామీలు నెరవేర్చలేదని, ఐదు డీఏలు పెండింగ్‌లోనే ఉన్నాయని గుర్తుచేశారు. "చంద్రబాబు గారూ.. అధికార అహంకారంతో మీరు వ్యవహరిస్తున్న తీరును, మీ నియంతృత్వ విధానాలను ప్రజలు గమనిస్తున్నారు.

# రూ.41,187.70 కోట్ల మేర రుణాలు సమకూర్చుకున్నాం: మంత్రి నారాయణ

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఎమ్మెల్యేలు శ్రావణ్ కుమార్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి అడిగిన ప్రశ్నలకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ సమాధానమిచ్చారు. అమరావతి రాజధాని పనులు పునఃప్రారంభమైన తర్వాత ప్రాజెక్టుల పురోగతి, కేటాయించిన నిధులు, వ్యయం, రైతుల రిటర్నబుల్ ప్లాట్ల పంపిణీకి సంబంధించిన కీలక వివరాలను ఆయన సభకు వెల్లడించారు.

ఇప్పటివరకు 119 ప్రధాన మౌలిక వసతుల ప్రాజెక్టులు ప్రతిపాదించగా, వాటిలో 113 ప్రాజెక్టులకు లెటర్ ఆఫ్ అప్రూవల్‌జారీ చేసినట్లు తెలిపారు. చాలా ప్రాజెక్టుల పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. ప్రాజెక్టుల పురోగతి: అమరావతిలో ఇప్పటివరకు 119 ప్రధాన మౌలిక వసతుల ప్రాజెక్టులను ప్రతిపాదించగా, వాటిలో 113 ప్రాజెక్టులకు లెటర్ ఆఫ్ అప్రూవల్ (ఒనీం)జారీ చేశారు. మొత్తం 97 ప్రాజెక్టుల పనులు ప్రారంభం కాగా, 4 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, హడ్కో, నాబార్డ్, ఔంఃఈఎఆ, ఒఖఖఈఅ ల ద్వారా రూ. 41,187.70 కోట్ల మేర రుణాలు సమకూర్చుకున్నాం. 2024 నుంచి ఇప్పటివరకు రూ. 12,731.13 కోట్లు ఖర్చు చేశాం పెరిగిన వ్యయం: అమరావతిలో ప్రతిపాదించిన 119 పనులకు మొత్తం రూ. 66,802 కోట్లు ఖర్చవుతుందని, ప్రస్తుతం పురోగతిలో ఉన్న 103 పనులకు రూ. 58,093 కోట్లు వెచ్చిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. గత ప్రభుత్వం రాజధాని పనులను నిలిపివేయడం వల్ల పనుల అంచనా వ్యయం దాదాపు 25 శాతం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ప్లాట్లు ఒ కౌలు: ల్యాండ్ పూలింగ్ విధానంలో భూములు ఇచ్చిన 30,173 మంది రైతులకు 71,299 రిటర్నబుల్ ప్లాట్లలో 98 శాతం కేటాయింపులు పూర్తి చేసి, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రాజధాని అమరావతిలోని 29 గ్రామాల్లో రూ. 904 కోట్లతో రహదారులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి, తాగునీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని,


ఈ పనుల టెండర్లను ఆగస్ట్ 27న ఖరారు చేయనున్నామని తెలిపారు. ఆర్ అండ్ బీ రోడ్లు: రాజధాని గ్రామాల్లో ఆర్ అండ్ బీ (ఖీడః) రోడ్ల పనుల్లో కొంత ఆలస్యం జరిగిందని అంగీకరించిన మంత్రి నారాయణ, సంబంధిత ఆర్ అండ్ బీ మంత్రితో చర్చించి ఆ పనులను వేగవంతం చేశామని సభలో తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టులో ప్రమాదంపై స్పందించిన మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకాశం జిల్లా వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్–2 లో జరిగిన ప్రమాదంపై ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# వైసీపీకి బూమ్ రాంగ్ అవుతోందా



**విజయవాడ** : రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం, చట్టాలు–పరిపాలనపై క్షుణ్ణమైన అవగాహన ఉన్న ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ వంటి వైఎస్సార్సీపీ సీనియర్ నేతలకు ఏది ప్రజాదరణ పొందే అంశమో, ఏది శూన్యమైన విమర్శో స్పష్టంగా తెలుసు. దశాబ్దాల తరబడి ఎన్నికల రాజకీయాలను ఒంటబట్టించుకున్న ఈ అనుభవజ్ఞులకు.. కనీస ఆధారం లేకుండా ప్రతిపక్షం లేవనెత్తే అంశాలు ప్రతికూలతను పెంచుతాయే తప్ప, ప్రజల నుంచి ఒక్క శాతం కూడా సానుకూలతను తీసుకురావు అనే నిలువెత్తు సత్యం తెలియంది కాదు. అయినా సరే, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్దేశిస్తున్న వ్యూహాలకు తలొగ్గి, తమ సొంత రాజకీయ క్రెడిబిలిటీని బలిపీఠం ఎక్కించేసుకుంటున్నారు. గతంలో ఉమ్మడి ఏపీ కాంగ్రెస్ హయాం నుంచి నేటి వైఎస్సార్సీపీ వరకు సీనియర్ నాయకులుగా చెరగని ముద్ర వేసుకున్న ఈ నేతలు.. జగన్ అనుసరిస్తున్న ఏకపక్ష రాజకీయ శైలి వల్ల సమాజంలో తమ ఆత్మగౌరవాన్ని కోల్పోతున్నారనే చర్చ నడుస్తోంది. డీఎస్సీ వంటి నిరుద్యోగ సున్నిత అంశాలపై ఎటువంటి డాక్యుమెంటరీ ఆధారాలు లేకపోయినా, కోర్టుల్లో విచారణకు కూడా నిలబడే సాక్ష్యాలు చూపించలేకపోయినా.. జగన్ మైక్ ముందు చెప్పిన ప్రతిపాయింట్‌నూ కిందిస్థాయిలో బలవంతంగా మోయాల్సి రావడం వారి రాజకీయ అనుభవానికే అవమానకరంగా మారింది. ఆధారం లేని పోరాటం వల్ల ఎంపికైన 16,000 మందికి పైగా ఉపాధ్యాయులు, వారి కుటుంబాల ఆగ్రహానికి గురికావాల్సి వస్తోంది. తన స్వయంకృతాపరాధ నిర్ణయాలతో స్వయంగా నెత్తిపై చేయి పెట్టుకునే భస్మాసుర రాజకీయాన్ని జగన్ నడుపుతుంటే, సీనియర్లు తెలిసీ తెలియక అందులో భాగస్వాములు అవుతున్నారనేది నిగ్గు తేలిన నిజం. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడా సజ్జల రామకృష్ణారెడ్డి నెట్‌వర్క్ చెప్పినట్లే వినాల్సి వచ్చిందని, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా సరే అదే తీరు కొనసాగుతోందని అంతర్గత మథనం వ్యక్తమవుతోంది. దశాబ్దాలుగా ప్రజాక్షేత్రంలో సంపాదించుకున్న గుర్తింపును, ఇమేజ్‌ను ఒకే వ్యక్తి రాజకీయ ఆధిపత్యం, వ్యర్థ రాజకీయ ఎజెండాల కోసం ధారపోయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నకు వారి వద్ద సమాధానం లేదు. ఇంత బతుకు బతికి సొంత రాజకీయాన్ని, స్వయంప్రతిపత్తిని పక్కనబెట్టి జగన్ రెడ్డి వద్ద ఈ రకంగా డీలా పడిపోవడానికి వారి మనసు ఎలా ఒప్పుతుందోగానీ, ఈ ధోరణి ఇలాగే కొనసాగితే వారి రాజకీయ జీవితాలకు ఇది తీవ్రమైన నష్టం చేకూరుస్తుంది. అధినేత చెప్పే తప్పుడు కథనాలకు మద్దతుగా ప్రెస్ మీట్లు పెట్టడం ఆపి, ఇప్పటికైనా తమ రాజకీయ వ్యూహాలను సమీక్షించుకోవాల్సిన తక్షణం ఆసన్నమైంది. సమాజంలో తమకున్న గౌరవాన్ని కాపాడుకోవడానికైనా లేదా ప్రత్యమ్నాయ రాజకీయ దారులు చూసుకోవడానికైనా ఈ సీనియర్ నాయకులు మౌనం వీడాల్సిన అవసరం ఉంది. సాంకేతిక అవకతవకలు, అక్రమాలుఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, రికార్డు స్థాయిలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన మెగా డీఎస్సీపై ప్రతిపక్షం ఆది నుంచి ఆరోపణలు గుప్పిస్తూనే ఉంది. అయితే ఆ ఆరోపణల్లో ఒక్కటంటే ఒక్క బలమైన చట్టబద్ధమైన ఆధారాన్ని కూడా వైసీపీ బయటపెట్టలేకపోయింది. సాంకేతిక అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఎన్ని కథనాలు అల్లినా, నిరుద్యోగులు గానీ, పరీక్ష రాసిన వేలాది మంది అభ్యర్థులు గానీ వాటిని నమ్మే పరిస్థితి లేదు. న్యాయస్థానాలను ఆశ్రయించి పక్కా సాక్ష్యాధారాలతో సీబీఐ విచారణ కోరడంలో ఆ పార్టీ తరపు నేతలు ఘోరంగా విఫలమయ్యారు. కోర్టుల్లో నిలబడని, ఆధారాలు సమర్పించలేని కథనాలతో వీధుల్లో రచ్చ చేయడం వల్ల ఆ పార్టీ చేస్తున్నది ప్రజాపోరాటం కాదని, కేవలం ఒక కుట్రపూరిత తప్పుడు రాజకీయం అని సామాన్య ప్రజలకు సైతం అర్థమైపోయింది. అన్నింటికంటే ముఖ్యంగా, ఈ ఉనికి లేని వివాదం వల్ల వైఎస్సార్సీపీ సమాజంలో తీవ్ర ప్రతికూలతను మూటగట్టుకుంటోంది.

# బోరుగడ్డ అనిల్ మెరుపు దీక్ష



**గుంటూరు :** తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నివాసం ముందు వైసీపీ సానుభూతిపరుడు బోరుగడ్డ అనిల్ కుమార్ సంచలన ఆందోళనకు దిగారు. తనను పార్టీ కార్యాలయం లోపలకు అనుమతించడం లేదని నిరసన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలతో అందరికీ షాక్ ఇచ్చారు. తాను వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అభిమాని అని, ఆయన కోసం పనిచేసిన తనకు పార్టీలో కనీస గౌరవం లేకుండా చేస్తున్నారని బోరుగడ్డ ఫైర్ అయ్యారు. జగన్ కోసం పనిచేసిన తనపై 22 కేసులు నమోదు చేశారని, తన కంపెనీలు మూసివేతకు గురయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. తన భార్యతో కలిసి జగన్ నివాసం వద్ద బోరుగడ్డ బైఠాయించడంతో కలకలం చెలరేగింది. వైసీపీ అధినేత జగన్ రెడ్డి నివాసం, పార్టీ కేంద్ర కార్యాలయం ముందు అనూహ్యంగా బోరుగడ్డ అనిల్ కుమార్ భార్యతో కలిసి బైఠాయించడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వైసీపీ అభిమానిగా ఎన్నో త్యాగాలు చేసిన తాను అధినేతను కలుస్తానంటే పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అంతేకాకుండా సజ్జల కోటరీతో తనను రౌడీషీటర్ అంటూ ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనపై రౌడీషీట్ లేదని హైకోర్టు చెప్పినా, వైసీపీ అధికార ప్రతినిధి కారుమూరి వెంకట్ రెడ్డి మాత్రం బోరుగడ్డ రౌడీషీటర్ అంటూ మాట్లాడుతున్నారని, ఆయనకు నోటీసులు పంపానని వెల్లడించారు.

ఈ సమయంలో గతంలో తాను కారుమూరు వెంకటరెడ్డితో మాట్లాడిన ఫోన్ కాల్ ఆడియోను మీడియాకు వినిపించారు తాను పార్టీ కోసం కష్టపడ్డానని, 9 నెలలు జైలులో ఉన్నానని అయినా తనను పార్టీ ఆఫీసులోకి రానీయడం లేదన్నారు. దళితులు మా మేనమామలు అని చెప్పే జగన్ రెడ్డి ఈ విషయంలో కల్పించుకోవాలని డిమాండ్ చేశారు. తనపై సజ్జల రామకృష్ణారెడ్డి కుట్ర పన్నుతున్నారని, ఈ విషయాలు ఏవీ ఆయనకు తెలియవని ఆరోపించారు. తమకు జగన్ రెడ్డి మాత్రమే నాయకుడు అని, సజ్జల నాయకుడు కాదని వ్యాఖ్యానించారు. ఇస్త్రీ బట్టలు వేసుకుని పార్టీ కార్యాలయంలో కూర్చునే సజ్జలకు ఇక్కడ పనేమీ లేదన్నారు. తమలాంటి వారు పార్టీ కోసం కష్టపడుతున్నామని, కేసులు పెట్టించుకుని రోడ్డు మీదపడ్డామని వాపోయారు. జగన్ సతీమణి భారతి, తల్లి విజయమ్మను అవమానించారనే తాను బయటకు వచ్చానని, అయినా అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఆహార ధరలు మరింత పెరగొచ్చు..?



దేశంలో వర్షపాతం తగ్గుదల, వ్యవసాయ ఉత్పత్తి పడిపోవడం కారణంగా ఆహార ధరలు మళ్లీ పెరగొచ్చని రాయిటర్స్ సర్వేలో నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో జులై నెలలో వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 4.50 శాతానికి చేరే అవకాశముందని అంచనా వేశారు. 40 మంది ఆర్థిక నిపుణులతో నిర్వహించిన ఈ సర్వే ప్రకారం.. జూన్‌లో 4.38 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం.. జులైలో మరింత పెరగవచ్చని అంచనా. అధికారిక గణాంకాలను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు.

దేశవ్యాప్తంగా అసమాన వర్షపాతం లోటు వల్ల పంటల ఉత్పత్తి దెబ్బతినడం ఆహార ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని నిపుణులు పేర్కొన్నారు.

భారతీయ కుటుంబాలు తమ వ్యయంలో 40 శాతానికి పైగా ఆహారానికే ఖర్చు చేస్తున్నందున ఈ ధరల పెరుగుదల నేరుగా కుటుంబ బడ్జెట్‌పై ప్రభావం చూపుతుందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ కనికా పస్రీచా తెలిపారు. అయితే ఆహారం, ఇంధనాన్ని మినహాయించినప్పటికీ ఇతర కీలక ద్రవ్యోల్బణం జులైలో 4.08 శాతంగా ఉండే అవకాశం ఉందని అంచనా.

రిటైల్ ద్రవ్యోల్బణం వరుసగా రెండో నెల కూడా 4 శాతం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. అయితే అది ఆర్‌బిఐ నిర్దేశించిన 2-6 శాతం పరిమితిలోనే కొనసాగుతోంది. దీంతో ఇటీవల జరిగిన ద్రవ్య విధాన సమీక్షలో ఆర్‌బిఐ కీలక రెపో రేటును యథాతథంగా కొనసాగించింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో అనిశ్చితి ద్రవ్యోల్బణానికి ప్రధాన ప్రమాదాలుగా ఆర్‌బిఐ పేర్కొనగా, దేశీయంగా ఇంధన ధరలు స్థిరంగా ఉండటం కొంత ఉపశమనంగా భావిస్తోంది.

జులైలో మరింత పెరగవచ్చని అంచనా. అధికారిక గణాంకాలను ఆగస్టు న విడుదల చేయనున్నారు. దేశవ్యాప్తంగా అసమాన వర్షపాతం లోటు వల్ల పంటల ఉత్పత్తి దెబ్బతినడం ఆహార ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని నిపుణులు పేర్కొన్నారు. భారతీయ కుటుంబాలు తమ వ్యయంలో 40 శాతానికి పైగా ఆహారానికే ఖర్చు చేస్తున్నందున ఈ ధరల పెరుగుదల నేరుగా కుటుంబ బడ్జెట్‌పై ప్రభావం చూపుతుందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ కనికా పస్రీచా తెలిపారు.మరోవైపు జులైలో టోకు ధరల సూచీ (డబ్ల్యుపిఐ) ఆధారిత ద్రవ్యోల్బణం జూన్ స్థాయి అయిన సుమారు 9.95 శాతం వద్దే కొనసాగవచ్చని అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సగటు రిటైల్ ద్రవ్యోల్బణం 5.0 శాతంగా ఉండవచ్చని ఆర్‌బిఐ ఇప్పటికే తన అంచనాల్లో పేర్కొంది.

# హిందాల్కో లాభంలో 75% వృద్ధి

ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థ హిందాల్కో ఇండస్ట్రీస్, ఏప్రిల్- జూన్‌లో రూ.7,013 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2025-26 ఇదే కాల లాభం రూ.4,004 కోట్లతో పోలిస్తే ఇది 75% ఎక్కువ. అన్ని వ్యాపార విభాగాల్లో మంచి పనితీరు సాధించామని కంపెనీ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.64,834 కోట్ల నుంచి 32% వృద్ధి చెంది రూ.85,882 కోట్లుగా నమోదైంది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో అల్యూమినియం అప్‌స్ట్రీమ్ విభాగ ఆదాయం రూ.13,403 కోట్లుగా, రాగి విభాగ ఆదాయం రూ.17,232 కోట్లుగా ఉంది. కంపెనీ అనుబంధ సంస్థ నొవెలిస్ ఆదాయం రూ.54,763 కోట్లకు చేరింది. ఏకీకృత ఎబిటా గతేడాదితో పోలిస్తే 37% పెరిగి రూ.14,989 కోట్లుగా నమోదైంది. అల్యూమినియం అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్, రాగి, నొవెలిస్ వ్యాపారాలు అత్యధిక త్రైమాసిక ఎబిటా సాధించాయి. రూ.50,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళికలు: కంపెనీ ఉత్పత్తి సామర్థ్యాలను పెంచేందుకు రూ.50,000 కోట్లతో మూలధన ప్రణాళికలు సిద్ధం చేసినట్లు హిందాల్కో ఎండీ సతీశ్ పాయ్ తెలిపారు. వీటితో అల్యూమినా, అల్యూమినియం, రాగి అప్‌స్ట్రీమ్ సామర్థ్యాలను పెంచడంతో పాటు వాల్యూ-యాడెడ్ డౌన్‌స్ట్రీమ్ ప్రాజెక్టులను విస్తరించనున్నారు.

మొత్తం ఆదాయం రూ.64,834 కోట్ల నుంచి 32% వృద్ధి చెంది రూ.85,882 కోట్లుగా నమోదైంది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో అల్యూమినియం అప్‌స్ట్రీమ్ విభాగ ఆదాయం రూ.13,403 కోట్లుగా, రాగి విభాగ ఆదాయం రూ.17,232 కోట్లుగా ఉంది. కంపెనీ అనుబంధ సంస్థ నొవెలిస్ ఆదాయం రూ.54,763 కోట్లకు చేరింది. ఏకీకృత ఎబిటా గతేడాదితో పోలిస్తే 37% పెరిగి రూ.14,989 కోట్లుగా నమోదైంది. సమీక్షా త్రైమాసికంలో లోహాల ధరలు అధికంగా ఉండటంతో కొనుగోలుదారులు అప్రమత్తత పాటించారని, పశ్చిమాసియా సంక్షోభం వల్ల శుద్ధి చేసిన రాగి దిగుమతులతో పాటు అంతర్జాతీయ సరఫరాలపై ప్రభావం చూపుతోందని పాయ్ వెల్లడించారు.

# పగడాల స్థావరాల రక్షణకు పరిశోధనలు!

హైదరాబాద్: శాస్త్రవేత్తలు ఆస్ట్రేలియా పగడాల రెమ్మలను గడ్డకట్టించి వాటి లార్వాను నిల్వచేసే ప్రక్రియను కనుగొనగలిగారు. వాతావరణ మార్పుల కారణంగా పగడాల స్థావరాలు తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ప్రక్రియ వాటి ఉనికిని రక్షించుకోడానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

సముద్రపు ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతుండడంతో సున్నితమైన పర్యావరణ వ్యవస్థలు అస్థిరమౌతున్నాయి. అందువల్ల పగడాల దిబ్బలను ఎలా కాపాడుకోవాలో శాస్త్రవేత్తలకు ఆందోళన కలిగిస్తోంది. గత ఏడేళ్లలో లా నినా తీవ్ర వాతావరణ ప్రభావంతో పగడాల స్థావరాలు నాలుగు సార్లు తమ రంగును ఉనికిని కోల్పోయాయి. గడ్డకట్టించే క్రయోజెనిక్ ప్రక్రియ వల్ల గడ్డ కట్టిన పగడాల రెమ్మలను నిల్వ చేసుకోవచ్చు. తిరిగి వాటిని ప్రవేశ పెట్టవచ్చు.


కానీ ప్రస్తుత ప్రక్రియలో లేజర్స్ వంటి అత్యంత ఆధునిక శాస్త్ర సాంకేతికత చాలా అవసరం. అయితే శాస్త్రవేత్తలు క్రయోమెష్ విధానంలో చాలా తక్కువ వ్యయంతో పగడాల స్థావరాలను భద్రపర్చవచ్చని చెబుతున్నారు.క్రయోమెష్ అంటే కృత్రిమంగా జాలిని తయారు చేయడం. ఈ మెష్ సాంకేతిక ప్రక్రియను యూనివర్శిటీ ఆఫ్ మిన్నెసోటా కు చెందిన కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. పగడాల రెమ్మలపై మొట్టమొదటిసారి పిహెచ్‌డి



విద్యార్థి నికొలాస్ జుకోవిచ్ ప్రయోగించారు. ఈ సాంకేతిక విధానం మైనస్ 320.8 డిగ్రీల ఫారన్ హీట్‌లో పగడాల లార్వాను భద్రపరచవచ్చునని పరిశోధకులు వివరిస్తున్నారు.

పగడాల స్థావరాల నుంచి సేకరించిన పగడపు పురుగుపై డిసెంబర్‌లో చేపట్టిన ప్రయో గాల్లో ఆస్ట్రేలియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెరైన్ సైన్సెస్(ఎఐఎంఎస్ )లో క్రయోమెష్ ప్రక్రియ ద్వారా పగడాల లార్వాను భద్రపర్చ గలిగారు.లార్వాలను తిరిగి సజీవంగా పునరుద్ధరించుకోగల సాధనాలను కలిగి ఉంటామని స్మిత్ సొనియన్ నేషనల్ జూ సీనియర్‌రీసెర్చి సైంటిస్టు మేరీ హెగెడోర్న్ పేర్కొన్నారు.

# విద్యార్థులతో చర్చలకు సిద్ధంజార్ఖండ్ సిఎం హేమంత్ సోరెన్



రాంచీ : ఆందోళన చేస్తున్న విద్యార్థులతో చర్చలు జరపడానికి తాము సిద్ధంగా ఉన్నామని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తెలిపారు. అలాగే, విద్యార్థుల డిమాండ్ మేరకు పటిష్టమైన సంస్కరణలు తీసుకురానున్నట్లు చెప్పారు. రాంచీలోని అసెంబ్లీ ప్రాంగణంలో శుక్రవారం సోరెన్ మీడియాతో మాట్లాడారు. జార్ఖండ్ పిఎస్‌సి, ఎస్ఎస్‌సి పరీక్షల్లో అక్రమాలపై కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. విద్యార్థులతో చర్చలు జరిపేందుకు తమ ప్రభుత్వం ఇప్పటికే మంత్రులు దీపికా పాండే సింగ్, సుదివ్య కుమార్‌లతో కూడిన ఐదుగురు సభ్యుల ప్రభుత్వ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు 11 మంది సభ్యులతో మరోక ప్రతినిధి బృందాన్ని కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. అయితే చర్చల విషయంపై తమకు అధికారికంగా ప్రభుత్వం నుంచి ఆహ్వానం రాలేదని విద్యార్థులు తెలిపారు.

మరోవైపు విద్యార్థుల ఆందోళనలు 14వరోజు అయిన కూడా కొనసాగాయి. అలాగే, విద్యార్థుల డిమాండ్ మేరకు పటిష్టమైన సంస్కరణలు తీసుకురానున్నట్లు చెప్పారు. రాంచీలోని అసెంబ్లీ ప్రాంగణంలో శుక్రవారం సోరెన్ మీడియాతో మాట్లాడారు. జార్ఖండ్ పిఎస్‌సి, ఎస్ఎస్‌సి పరీక్షల్లో అక్రమాలపై కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే.

విద్యార్థులతో చర్చలు జరిపేందుకు తమ ప్రభుత్వం ఇప్పటికే మంత్రులు దీపికా పాండే సింగ్, సుదివ్య కుమార్‌లతో కూడిన ఐదుగురు సభ్యుల ప్రభుత్వ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఆరుగురు నిరాహార దీక్ష కొనసాగిస్తుండగా, రెండు విద్యార్థి సంఘాలు విధానసభ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించాయి.

# భారత్‌కు 67% ఎల్‌పిజి అమెరికా నుంచే..

మధ్యప్రాచ్యంలో నెలకొన్న సంక్షోభం, కీలకమైన హార్ముజ్ జలసంధిలో రవాణాకు అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో భారత్ తన ఇంధన సరఫరా వ్యూహాన్ని వేగంగా మార్చుకుంది. ఇందులో భాగంగా అమెరికా ఇప్పుడు భారత్‌కు అత్యధిక ఒఖఉ సరఫరా చేస్తున్న దేశంగా అవతరించింది. ప్రస్తుతం భారత్ దిగుమతి చేసుకుంటున్న ఒఖఉలో దాదాపు 67 శాతం అమెరికా నుంచే వస్తోందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. మధ్యప్రాచ్య సంక్షోభం కారణంగా గల్ఫ్ దేశాల నుంచి ఒఖఉ దిగుమతులు తగ్గినప్పటికీ, ప్రత్యామ్నాయ వనరులను వేగంగా అభివృద్ధి చేయడం ద్వారా దేశంలో ఇంధన కొరత రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. "ప్రస్తుతం మా ఒఖఉ దిగుమతుల్లో దాదాపు 67 శాతం అమెరికా వాటా ఉంది" అని హర్దీప్ సింగ్ పురి తెలిపారు. హార్ముజ్ జలసంధి ద్వారా ఇంధన సరఫరాలకు అంతరాయం ఏర్పడిన సమయంలో భారత్ ఒక్క ప్రాంతంలో కూడా ఇంధన కొరత రాకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించిందని వివరించారు. దేశీయ ఒఖఉ ఉత్పత్తిని కూడా పెంచినట్లు మంత్రి తెలిపారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు దేశీయ ఉత్పత్తి పెంపు ద్వారా సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసినట్లు చెప్పారు. మధ్యప్రాచ్య సంక్షోభం సమయంలో సరఫరా అంతరాయాలు ఎదురైనప్పటికీ దేశంలో ఎక్కడా ఇంధన కొరత రాలేదని పూరి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 1.07 లక్షలకు పైగా ఫ్యూయల్ రిటైల్ అవుట్‌లెట్లు ఉన్నాయని, వాటిలో ఒక్క స్టేషన్ కూడా ఇంధనం లేకుండా నిలిచిపోలేదని ఆయన అన్నారు. 2014లో దేశంలో ఇలాంటి ఫ్యూయల్ రిటైల్ అవుట్‌లెట్లు సుమారు 52,000 మాత్రమే ఉండేవని, గత కొన్నేళ్లలో ఈ నెట్‌వర్క్



గణనీయంగా విస్తరించిందని తెలిపారు. భారత్ తన క్రూడ్ ఆయిల్ దిగుమతుల వనరులను కూడా విస్తరించింది. గతంలో 27 దేశాల నుంచి ముడి చమురు దిగుమతి చేసుకునే భారత్.. ప్రస్తుతం 41 దేశాల నుంచి క్రూడ్ ఆయిల్‌ను సమీకరిస్తోందని మంత్రి వెల్లడించారు. ఇలా సరఫరా వనరులను విస్తరించడం వల్ల ఒకే ప్రాంతం లేదా దేశంపై అధికంగా ఆధారపడే పరిస్థితి తగ్గిందని చెప్పారు. అలాగే దేశంలోని సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ కూడా విస్తరించింది. గతంలో 55 భౌగోళిక ప్రాంతాలకు పరిమితమైనఈ కవరేజీ ప్రస్తుతం 309 భౌగోళిక ప్రాంతాలకు చేరిందని తెలిపారు. మధ్యప్రాచ్యం నుంచి ప్రపంచంలోని వివిధ దేశాలకు చమురు,గ్యాస్ సరఫరాలో స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ కీలకమైన సముద్ర మార్గంగా ఉంది. మధ్యప్రాచ్యంలో సంక్షోభం ప్రారంభం కావడానికి ముందు భారత్ దిగుమతి చేసుకునే క్రూడ్ ఆయిల్‌లో దాదాపుసగంవరకు హార్ముజ్ జలసంధిని రవాణా మార్గంగా ఉపయోగించే దేశాల నుంచి వచ్చేది. అలాగే భారత్‌కు అవసరమైన ఒఖఉలో కనీసం 90 శాతం, ఇతర గ్యాస్ దిగుమతుల్లో సుమారు 60 శాతం ఈ జలమార్గం ద్వారా వచ్చేవని పురి తెలిపారు.

# నాణ్యమైన ఔషధాలే ప్రజారోగ్యానికి భరోసా...



ఔషధ తయారీ సంస్థల్లో జరిగే ప్రతి తనిఖీ, ప్రయోగశాల పరీక్ష, నియంత్రణ సంస్థలు తీసుకునే ప్రతి నిర్ణయం నేరుగా రోగుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యూఎస్ ఎఫ్‌డీఏ) ఇండియా కార్యాలయం కంట్రీ డైరెక్టర్ గ్రెగరీ స్మిత్ పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు శాస్త్రీయ విధానాలు, అంతర్జాతీయ సహకారం, నాణ్యమైన తనిఖీ వ్యవస్థ మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ఔషధ నియంత్రణ పరిపాలన ఆధ్వర్యంలో అమెరికా ఫార్మకోపియా, ఆల్ ఇండియా డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ సంయుక్తంగా విజయవాడలో శుక్రవారం నిర్వహించిన 'నాణ్యమైన ఔషధాల భరోసా ? నియంత్రణ, ప్రమాణాలు, తనిఖీల్లో శాస్త్రీయ విధానం' అంశంపై వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ.. అమెరికా ఎఫ్‌డిఎ పర్యవేక్షణలో ఉన్న ఔషధ తయారీ కేంద్రాల్లో సగానికి పైగా అమెరికా వెలుపలే ఉన్నాయని, అందులో భారత్ కీలక భాగస్వామిగా నిలుస్తోందన్నారు. అమెరికాకు ఎగుమతి అయ్యే ఔషధాల తయారీలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని, రాష్ట్రంలో యూఎస్ ఎఫ్‌డిఎ ఆమోదం పొందిన 119 ఔషధ తయారీ కేంద్రాలు ఉండటం ఫార్మా రంగ సామర్థ్యానికి నిదర్శనమని తెలిపారు. తనిఖీల్లో సాధారణంగా విధివిధానాల అమలులో లోపాలు, సమగ్ర విచారణ లేకపోవడం, ప్రయోగశాల నియంత్రణల్లో బలహీనతలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి అంశాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


ఔషధ నాణ్యతను కాపాడడంలో శాస్త్రీయ ప్రమాణాల అమలు అత్యంత కీలకమన్నారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్ వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తూ.. వ్యాపార నిర్వహణను సులభతరం చేసేందుకు నిబంధనలను సరళీకరిస్తున్నప్పటికీ, మందుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తయారయ్యే ఔషధాలు ప్రపంచవ్యాప్తంగా వినియోగంలో ఉన్నందున నియంత్రణ అధికారుల బాధ్యత మరింత పెరిగిందన్నారు. నాసిరకం మందుల విషయంలో ప్రభుత్వం 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమెరికా ఫార్మకోపియా ఇండియా సైట్ హెడ్ డాక్టర్ గిరీష్ కపూర్, ఆల్ ఇండియా డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్, ఎపి డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఎం. పాండురంగ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాక్, సౌదీ, టర్కీ రక్షణ ఒప్పందం...

పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో పాకిస్థాన్, సౌదీఅరేబియా, టర్కీ దేశాలు కొత్త రక్షణ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం, మూడు దేశాల్లో ఏ ఒక్క దేశంపై దాడి జరిగినా దానిని మూడు దేశాలపై జరిగిన దాడిగా పరిగణించనున్న ట్లు ప్రకటించాయి. మక్కాలో నిర్వహించిన 'జాయింట్ డిఫెన్స్ మక్కా అల్-ముఖర్రమా' శిఖరాగ్ర సమావేశంలో ఈ ఒప్పందం కుదిరింది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్, టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ ఈ ఒప్పందంపై సంతకాలు చేసినట్లు మూడు దేశాల విదేశాంగ మంత్రిత్వ శాఖలు వెల్లడించాయి.



# అరటిపండు ఆరోగ్య ప్రయోజనాలు..



అరటి పండు రుచికరమైన పండే కాకుండా శరీరానికి అవసరమైన కార్బోహైడ్రేట్లు, పొటాషియం, ఫైబర్, ప్రోటీన్లు వంటి కీలక పోషకాలతో నిండిన సూపర్ ఫుడ్. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడం, గుండె ఆరోగ్యాన్ని కాపాడడం, రక్తపోటును నియంత్రించడం, శరీరానికి తక్షణ శక్తిని అందించడం వంటి అనేక ప్రయోజనాలను కలిగిస్తుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు దేశంలో ప్రజలు ఇష్టంగా తినే పండ్లలో అరటి పండుకు ప్రత్యేక స్థానం ఉంది. దీనిలో అనేక రకాలు ఉన్నప్పటికీ, పసుపు రంగు అరటిపండ్లు విరివిగా లభిస్తాయి. అరటి పండ్లలో పోషకాలు అపారంగా ఉంటాయి. శరీరానికి తక్షణ శక్తినిచ్చే కార్బోహైడ్రేట్లు, గుండెను పదిలంగా ఉంచే పొటాషియం ఇందులో అధికంగా లభిస్తాయి. అరటి పండులో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. ఉదాహరణకు, సుమారు 80 గ్రాముల బరువున్న ఒక అరటి పండులో 65 కిలో కేలరీల ఎనర్జీ, 1 గ్రాము ప్రోటీన్, 0.1 శాతం ఫ్యాట్, 16.2 గ్రాముల కార్బోహైడ్రేట్స్, 1.1 గ్రాముల ఫైబర్, 264 మిల్లీగ్రాముల పొటాషియం ఉంటాయి. ఈ పోషకాలు శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. మెరుగైన జీర్ణక్రియ: అరటి పండ్లలో అధికంగా ఉండే పెక్టిన్ పేగు పనితీరును మెరుగుపరుస్తుంది. దీనిలోని ఫైబర్ ఆహారం త్వరగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది, శరీరంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. అధిక ఫైబర్ కడుపు నిండిన భావనను కలిగించి, కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తుంది. అరటి పండులోని కార్బోహైడ్రేట్లు సులభంగా జీర్ణం కాని ఆహార పదార్థాలు కూడా జీర్ణం కావడానికి తోడ్పడతాయి. ఇది పేగులో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా వృద్ధికి సహాయపడి, ఫ్యాటీ ఆమ్లాలను ఉత్పత్తి చేస్తుంది. గుండె ఆరోగ్యం ? రక్తపోటు నియంత్రణ: అరటి పండ్లలో పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు పుష్కలం. పొటాషియం శరీరంలోని అత్యంత ముఖ్యమైన ఎలెక్ట్రోలైట్లలో ఒకటి. ఇది గుండె పనితీరును మెరుగుపరుస్తుంది, శరీరంలో ఫ్లూయిడ్ల సమతౌల్యాన్ని కాపాడుతుంది, రక్తపోటును నియంత్రిస్తుంది. పొటాషియం రక్తపోటును తగ్గించడమే కాకుండా గుండెపోటు, స్ట్రోక్ రాకుండా అడ్డుకుంటుందని శాస్త్రీయంగా నిరూపితమైంది. ఆమ్లత నియంత్రణ: పొట్టలో విడుదలయ్యే ఆమ్లాలను అరటిపండ్లు సమతౌల్యం చేస్తాయి. ఇందులో ఉండే లూకోసియానిడిన్ పేగులోని పలుచని పొరను మందంగా చేయడానికి ఉపయోగపడుతుంది, తద్వారా ఆమ్లాల ప్రభావాన్ని తగ్గిస్తుంది. బాగా పండిన అరటి పండ్లు గుండెల్లో మంట (ఎసిడిటీ) నుంచి తక్షణ ఉపశమనం కలిగిస్తాయి.

# నరనరాల్లో బలహీనతను నిముషాల్లోనే తరిమికొడుతుంది



ఇవి నరాల ఆరోగ్యానికి ఎంతగానో సహాయపడుతుంది. ఇంకా దీనిలో ఉండే మెగ్నీషియం కండరాలను బలంగా చేస్తాయి. ఇవి శరీరానికి శక్తిని అందిస్తాయి. మీకు ఎప్పుడైనా అలసటగా అనిపించినప్పుడు దీనిని మీరు స్నాక్‌గా ఎంచక్కా తినొచ్చు.

ఫూల్ ముఖాన నరాల ఆరోగ్యానికి ఎంతగానో సహాయపడుతుంది. ఇంకా దీనిలో ఉండే మెగ్నీషియం కండరాలను బలంగా చేస్తాయి. ఇవి శరీరానికి శక్తిని అందిస్తాయి. మీకు ఎప్పుడైనా అలసటగా అనిపించినప్పుడు దీనిని మీరు స్నాక్‌గా ఎంచక్కా తినొచ్చు. ఇంకా ఇవి ఎముకల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇంకా దీనిలో ఉండే ఖనిజాలు కూడా ఎముకల బలాన్నీ పెంచుతాయి.

అలాగే, ఇవి జీర్ణక్రియ పనితీరును కూడా మెరుగు పరుస్తాయి. అయితే, మీరు వీటిని సరైన మోతాదులో తీసుకుంటే మంచిది. అలా అని మరి ఎక్కువగా కూడా దీనిని తీసుకోకూడదు. బరువు తగ్గించడంలో కూడా ఇవి ఉపయోగపడతాయి. ఇంకా మీరు జంక్‌ఫుడ్‌కు బదులుగా వీటిని తక్కువ ఆయిల్ తో కాల్చుకుని మఖానా తీసుకోవచ్చు. గుండె ఆరోగ్యానికి కూడా ఇది మంచి ఆహారం. ఇంకా ఎక్కువ ఆయిల్, ఉప్పు లేకుండా దీనిని తీసుకోవడం మంచిది. హై బీపీ సమస్యలు ఉన్నవాళ్లు ఉప్పు ఎక్కువగా వెయ్యకూడదు.

# వంటింటి మసాలా కాదు ఆరోగ్యానికి సహజ ఔషధం!



వంటింట్లో ప్రతిరోజూ ఉపయోగించే అల్లం కేవలం రుచికోసమే కాదు, ఆరోగ్యానికి కూడా అమూల్యమైన సహజ ఔషధం. ఇందులోని జింజరోల్ వంటి శక్తివంతమైన సమ్మేళనాలు జీర్ణక్రియను మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడం, జలుబు?దగ్గును తగ్గించడం, కీళ్ల నొప్పులకు ఉపశమనం కలిగించడం, గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో సహాయపడతాయి.

అలాగే వికారం తగ్గించడంలో, రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణకు తోడ్పడడంలో కూడా అల్లం ఉపయోగకరంగా ఉండవచ్చు. అల్లం ప్రతి వంటగదిలో దాదాపు ప్రతిరోజూ ఉపయోగించే అత్యంత ముఖ్యమైన మసాలా దినుసులలో ఒకటి. ఇది ఆహారానికి ప్రత్యేకమైన రుచి, సువాసనను అందించడమే కాకుండా శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. ఆయుర్వేదంలో వేల సంవత్సరాలుగా అల్లాన్ని సహజ ఔషధంగా ఉపయోగిస్తున్నారు. ఇందులో ఉండే జింజరోల్ అనే శక్తివంతమైన సమ్మేళనం యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలను కలిగి ఉండటంతో శరీరాన్ని అనేక వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. అల్లంలోని జింజరోల్, షోగావోల్ వంటి సమ్మేళనాలు జీర్ణరసాల ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. దీంతో ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. అజీర్ణం, గ్యాస్, కడుపు ఉబ్బరం, కడుపు బరువుగా అనిపించడం వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

# ఉదయాన్నే టీ, కాఫీ బదులు ఇది తాగండి..



ఉదయాన్నే టీ, కాఫీ తాగే అలవాటు జీర్ణవ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాటికి బదులుగా సబ్జా గింజల పానీయం తీసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడటంతో పాటు బరువు తగ్గడం, గట్ ఆరోగ్యం మెరుగుపడటం, శరీర వేడి తగ్గడం వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఉదయం లేవగానే చాలామంది టీ లేదా కాఫీ తాగడానికి అలవాటు పడి ఉంటారు. కొందరు దినచర్యలో భాగంగా దీన్ని అనుసరిస్తే, మరికొందరు మలబద్ధకం నుంచి ఉపశమనం కోసం తాగుతారు. అయితే, ఖాళీ కడుపుతో టీ లేదా కాఫీ తాగడం వల్ల గట్ ఆరోగ్యం దెబ్బతింటుంది. ఇది జీర్ణక్రియ సంబంధిత సమస్యలకు దారితీస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.. ఈ సమస్యలకు పరిష్కారంగా, సబ్జా గింజల పానీయం ఒక ఆరోగ్యకరమైన, ప్రయోజనకరమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని పేర్కొంటున్నారు. సబ్జా గింజలు వాటి అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలకు ప్రసిద్ధి చెందాయి. ఇవి ముఖ్యంగా జీర్ణక్రియను మెరుగుపరచడంలో, బరువు తగ్గించడంలో, శరీర వేడిని తగ్గించడంలో సహాయపడతాయి. గట్ ఆరోగ్యం మెరుగుపడటం వల్ల బీపీ, డయాబెటిస్, పీసీఓడీ, పీసీఓఎస్, క్రమరహిత పీరియడ్స్ వంటి అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. 30 సంవత్సరాలు దాటిన తర్వాత జీర్ణశక్తి క్రమంగా తగ్గుతుంది.. కాబట్టి, గట్ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. సబ్జా గింజలను తీసుకోవడం చాలా సులభం.

# ఇకనైనా సెలబ్రిటీలను ద్వేషించడం ఆపండి




సిద్ధార్థ్ హీరోగా, ఓని సేన్ దర్శకత్వంలో వచ్చిన లేటెస్ట్ సిరీస్ 'ఆపరేషన్ సేఫ్ సాగర్'. ఇందులో జిమ్మీ షెర్‌గిల్, దియా మీర్జా, ప్రాజక్తా కోలీ, అభయ్ వర్మ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నారు. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ చేసిన గొప్ప పోరాటం ఆధారంగా నెట్‌ఫ్లిక్స్ ఈ వెబ్‌సిరీస్‌ను తీసుకొచ్చింది. అయితే ఈ సిరీస్ ఆగస్టు 7నుంచి స్ట్రీమింగ్ అందుబాటులోకి వచ్చింది. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సిద్ధార్థ్ సంచలన కామెంట్స్ చేశారు. రాజకీయాలు, సామాజిక సమస్యలు లేదా దేశంలో జరిగే పెద్ద పెద్ద విషయాలపై సినీ నటులు ఎందుకు మాట్లాడకుండా మౌనంగా ఉంటున్నారో సిద్ధార్థ్ తెలిపారు.

మన దేశంలో జరిగే సున్నితమైన విషయాలపై కళాకారులు తమ అభిప్రాయం చెబితే, సోషల్ మీడియాలో వారిపై ఎంతో దారుణంగా విమర్శలు, దాడి జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నటులు ఎదుర్కొంటున్న ఇబ్బందిని తేలికైన మాటల్లో చెబుతూ, సోనమ్ వాంగ్‌చుక్ మంచివాడైనా లేదా కాకపోయినా, విద్యార్థులకు ధర్నాలు చేసే హక్కు ఉన్నా లేకపోయినా..

ఈ రెండింటిలో తాము ఏ విషయం చెప్పినా ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చి విచ్చలవిడిగా బూతులు తిడుతున్నారని సిద్ధార్థ్ అన్నారు. అందుకే కళాకారులను ఇలా ద్వేషించడం ఆపాలని ఆయన కోరారు. ఒక నటుడి నటన లేదా సినిమా బాగుందో లేదో చెప్పకుండా, వారి సొంత నమ్మకాలు, కామెంట్స్ ఆధారంగా వారిని తిట్టడం చాలా తప్పు అని ఆయన గట్టిగా చెప్పారు.

# అల్లు అర్జున్, ఆనంద్ దేవరకొండ ఇద్దరి సినిమాల బడ్జెట్ ఒకటే



తెలుగు సినిమా పరిశ్రమలో ముక్కుసూటిగా మాట్లాడే నిర్మాతల్లో సూర్యదేవర నాగ వంశీ ఒకరు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన సినిమా పరిశ్రమకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం పెరిగిపోయిన సినిమా ప్రొడక్షన్ ఖర్చులపై ఆయన ఓపెన్ అయ్యారు. నాగ వంశీ మాట్లాడుతూ.. గతంతో పోలిస్తే ప్రస్తుతం సినిమా నిర్మాణ ఖర్చులు భారీగా పెరిగిపోయాయి. కొన్ని సంవత్సరాల క్రితం అల్లు అర్జున్ వంటి స్టార్ హీరోతో, త్రివిక్రమ్ శ్రీనివాస్ వంటి టాప్ డైరెక్టర్‌తో 'సన్నాఫ్ సత్యమూర్తి' సినిమా చేశాం. ఆ సమయంలో ఆ సినిమా షూటింగ్‌కు రోజుకు దాదాపు రూ.15 లక్షల వరకు ఖర్చయ్యేది. కానీ ప్రస్తుతం సినిమా నిర్మాణ ఖర్చులు భారీగా పెరిగిపోయాయి. మేము ప్రస్తుతం ఆనంద్ దేవరకొండతో 'ఎపిక్' అనే సినిమా చేస్తున్నాం.

ఆనంద్ దేవరకొండ వంటి మిడ్‌రేంజ్ హీరోతో చేస్తున్న ఈ సినిమాకు కూడా రోజుకు దాదాపు రూ.15 లక్షల వరకు ఖర్చవుతోంది. దీన్ని బట్టి గతంతో పోలిస్తే ప్రస్తుతం సినిమా ప్రొడక్షన్ ఖర్చులు ఎంతగా పెరిగిపోయాయో అర్థం చేసుకోవచ్చు అని నాగ వంశీ తెలిపారు. అలాగే సినిమా కలెక్షన్ల పోస్టర్లలో నెంబర్లు పెంచి చూపించే విషయంపై కూడా నాగ వంశీ స్పందించారు. తెలుగు సినిమా పరిశ్రమలో కలెక్షన్ల నెంబర్లు కొంతవరకు పెంచకుండా పోస్టర్ బయటకు రాదు. పెద్ద సినిమాలు చేసినప్పుడు అభిమానులను సంతోషపెట్టాలి కదా. ఉదాహరణకు రూ.100 వస్తే రూ.110 అని పోస్టర్‌లో వేస్తాం. అంతేకానీ రూ.100 వస్తే ఏకంగా రూ.200 వచ్చాయని మాత్రం చెప్పం అని నాగ వంశీ స్పష్టం చేశారు.

# ఆద్యంతం నవ్విస్తుంది



అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సం యుక్తంగా సమర్పిస్తూ నిర్మిస్తున్న కుటుంబ కథా చిత్రం 'పళ్ళ బురుసు'. ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణాని నిర్మాతలు.

ఉదయ్ చౌహాన్ రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, గోమతి, ప్రజ్వల్ యాద్మ, సుజాత కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈనెల 14న సినిమా విడుదల కానుండగా, తాజాగా నాగార్జున అక్కినేని ఈ చిత్ర ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ట్రైలర్‌ను డిజిటల్ విడుదలకు ముందే సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండలం లచ్చపేట గ్రామ ప్రజల కోసం ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా అక్కినేని నాగార్జున లచ్చపేట ప్రజలకు కృతజ్ఞతలు తెలిపే వీడియోను ప్రదర్శించారు. నాగార్జున మాట్లాడుతూ,'సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండలం లచ్చపేట గ్రామ ప్రజలందరికీ నా నమస్కారం. 'పళ్ళ బురుసు' సినిమా షూటింగ్ లచ్చపేట గ్రామంలోనే జరిగింది. అందుకే ఈ ట్రైలర్‌ను ముందుగా మీ అందరికీ చూపించి విడుదల చేయాలనుకున్నాం. మీ అందరి ప్రేమ, ఆదరణ చూసి చాలా ఆనందంగా అనిపించింది' అని అన్నారు.

# 'హాయ్' రిలీజ్ ఎప్పుడంటే?



నయనతార, కవిన్ తొలిసారి కలిసి నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'హాయ్' విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ఈనెల 28న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. విష్ణు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో కె. భాగ్యరాజ్, ప్రభు, రాధికా శరత్‌కుమార్, వీటీవీ గణేష్, సత్యన్, ఆదిత్య కథిర్, ఖురైషి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రాజేష్ శుక్లా సినిమాటోగ్రఫీ అందించగా, జెన్ మార్టిన్ సంగీతం సమకూర్చారు. ఫిలోమిన్ రాజ్ ఎడిటర్‌గా, ఎస్. కన్నన్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. జీ స్టూడియోస్, ది రౌడీ పిక్చర్స్, సెవెన్ స్క్రీన్ స్టూడియో బ్యానర్లపై నయనతార, విఘ్నేష్ శివన్, ఎస్.ఎస్. లలిత్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వినోద్ సి.జే., కె.ఎస్. మయిల్ వాగనన్ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, వి.కె. కుబేంద్రన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు. దర్శకుడు విష్ణు మాట్లాడుతూ, 'హాయ్' టైటిల్‌లాగే ఇది ఒక సింపుల్, హార్ట్ వార్మింగ్, ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. చెన్నై, కోయంబత్తూరు, పొల్లాచ్చి నేపథ్యాల్లో సాగే ఈ సినిమా కుటుంబం మొత్తం కలిసి థియేటర్‌లో చూసి ఆస్వాదించేలా రూపొందించాం. 'డార్లింగ్ డార్లింగ్ డార్లింగ్', 'సంతోష్ సుబ్రమణ్యం', 'యారాడి నీ మోహిని' వంటి చిత్రాల తరహాలో బంధాలు, భావోద్వేగాలు, హాస్యంతో సాగే కథ ఇది' అని తెలిపారు.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com